సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 24.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 152
పేజీలు: 12 వెల: రూ. 5

# అవాంఛిత సెలవులు

బాసర ట్రిపుల్ ఐటీలో ఏం జరుగుతోంది? 09

- సమస్యల నుంచి తప్పించుకునే యత్నమా?
- విద్యార్థిని మృతి తర్వాత ఉద్రిక్తతలు
- అస్తవ్యస్త పరిస్థితులు.. చదువులపై ప్రభావం
- అడ్మిషన్లపై పడే ప్రమాదం



సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న బాసర ట్రిపుల్ ఐటీలో తాజా పరిణామాలు కలకలం రేపుతున్నాయి. విద్యార్థుల వరుస నిరసనలు, సిబ్బంది ఆందోళనలు, ఇటీవల విద్యార్థిని మరణంతో పెల్లుబికిన ఆగ్రహావేశాల మధ్య యాజమాన్యం హఠాత్తుగా సెలవులు ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

• నిరాయుధ రాజకీయం

# రేవంత్ మార్క్

## ప్రత్యర్థుల అరెస్ట్ లు వద్దంటూ పోలీసులకు ఆదేశాలు?

## కేవలం భయం చుట్టూరా రాజకీయం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** సీఎం రేవంత్ రెడ్డి రాజకీయం మారుస్తున్నారు. ఆవేశంతో చెప్పే ప్రకటనలను తీరిగ్గా నెమరువేసుకుంటున్నారు. అధికారంలోకివస్తే చర్లపల్లి జైలులో కేసీఆర్ కుటుంబం కోసం డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తా అని రేవంత్ ఎన్నికలకు ముందు సవాల్ చేశారు. కానీ ఇప్పుడు ఆ ఆలోచనే చేయడం లేదు. ఇప్పుడు తెలంగాణ రాజకీయంలో అందరినీ తొలుస్తున్న ఏకైక ప్రశ్న గులాబీ బాస్‌ల అరెస్టు ఎప్పుడు? . గడప దాటిన ప్రతిచోటా, ప్రతి మీడియా సమావేశంలోనూ రేవంత్ రెడ్డికి ఎదురయ్యే ఈ ప్రశ్న వెనుక ఒక ఉత్కంఠ ఉంది. దానికి కారణం గతంలో రేవంత్‌పై కేసీఆర్ చేసిన రాజకీయమే. అయితే, రేవంత్ రెడ్డి చట్టం తన పని తాను చేస్తుంది అనే వ్యూహమే పాటిస్తున్నారు. దీని వెనుక ఒక లోతైన రాజకీయ వ్యూహం దాగుంది. ప్రత్యర్థులను జైలు పాలు చేయడం ద్వారా తక్షణ రాజకీయ మైలేజీ పొందడం కంటే, వారిని రాజకీయంగా నిరాయుధులను చేయడమే లక్ష్యంగా ఆయన

**జైలుకు పంపితే బలపడుతారనే అనుమానం**


**రాజకీయంగా తొక్కడమే లక్ష్యం**

**విపక్ష నేతలపై రేవంత్ వ్యూహాత్మక గేమ్**

అడుగులు వేస్తున్నారు.

**విచారణే ప్రధానాస్త్రం**

రాజకీయాల్లో అరెస్టు అనేది రెండు అంచుల కత్తి. ఒక నాయకుడిని జైలుకు పంపడం మిగతా 02లో






## తెలంగాణ నుంచి తిరుపతి

అందుబాటులోకి కొత్త హైవే..

- అటవీ ప్రాంతం మీదుగా కొండలు..
- లోయల మధ్య ఆహ్లాదకర ప్రయాణం
- నేషనల్ హైవే 565 అందుబాటులోకి
- యర్రగొండపాలెం వద్ద పూర్తయిన పనులు
- తిరుపతి, తెలంగాణ మధ్య ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం 09

## పైశాచిక కాంగ్రెస్

ప్రజలను మోసం చేసి పాలన



- 6 గ్యారంటీల అమలుపై బీజేపీ ఛలో అసెంబ్లీ
- పోలీసుల అడ్డగింతపై ఎమ్మెల్యేల ఫైర్ 09

## కుంటుబాల కంటే రేషన్ కార్డులే ఎక్కువ?




- తెలంగాణ ఉచిత బియ్యం పంపిణీపై 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' సంచలన నివేదిక!
- అర్హతల ఉల్లంఘనపై ఆందోళన 10

# ఆఫర్ హరీశ్ కేనా?

## అయితే చెక్.. లేదంటూ క్లోజ్

- సిద్దిపేట వ్యాఖ్యల్లో రేవంత్ మర్మం..?
- అటు బీఆర్ఎస్ లో కూడా హరీశ్ కు కష్టకాలం
- కేటీఆర్ తో పొసగడం లేదనే ప్రచారం
- ఇదే సమయంలో సీఎం ఆఫర్..?




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, సిద్దిపేటలో గెలిచే కాంగ్రెస్ అభ్యర్థికి మంత్రి పదవి ఇస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మాజీ మంత్రి హరీశ్‌కు చెక్ పెట్టడంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంకేతాలు ఇచ్చినా.. ఈ వ్యాఖ్యల ముసుగులో హరీశ్ రావుకు ఆఫర్ ఇచ్చినట్లుగా మరో టాక్. ఎందుకంటే ఇప్పటికే బీఆర్ఎస్ లో అంతర్యుద్ధం నడుస్తూనే ఉంది. కేటీఆర్ టీం.. హరీశ్ రావు వర్గాన్ని దూరం పెడుతూనే ఉంది. అటు కవిత కూడా హరీశ్ ను టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఇలాంటి సమయంలో హరీశ్ రావును అక్కున చేర్చుకునేందుకు రేవంత్ రెడ్డి స్కెచ్ వేసినట్లుగా భావిస్తున్నారు. నిజానికి, ఇటీవల హరీశ్ కూడా దూకుడు తగ్గించారు. మిగతా 02లో


## ఓడినా తగ్గని పెత్తనం

### కరీంనగర్‌లో కంటెస్టెడ్ నేతల కొత్త డ్రామా!

- గెలవకపోయినా గెలిచినట్టే హంగామా.. కొత్త రాజకీయ ట్రెండ్
- 'కంటెస్టెడ్' హోదాలతో పెత్తనం.. స్థానిక పాలనలో గందరగోళం
- ఫ్లెక్సీలు, స్టిక్కర్లతో ఫేక్ పవర్ ప్లే.. అధికారులకు తలనొప్పి
- ఓడిన నేతల కొత్త స్ట్రాటజీ.. చట్టపరమైన చర్యల డిమాండ్ 06

కరీంనగర్ రాజకీయాల్లో సరికొత్త వింత ట్రెండ్ పుట్టుకొచ్చింది. ఎన్నికల్లో గెలిచిన వారికే పదవి, పవర్ ఉండాలనే ప్రజాస్వామ్య సూత్రానికి కొందరు నేతలు తిలోదకాలు ఇస్తున్నారు. గెలవకపోయినా గెలిచిన వారితో సమానంగా 'కంటెస్టెడ్' (Contested) అనే హోదాతో పెత్తనం చెలాయిస్తూ, ఫ్లెక్సీలు, కార్లపై స్టిక్కర్లతో కొత్త రకం రాజకీయ డ్రామాకు తెరలేపుతున్నారు. ఈ 'ఫేక్ పవర్ ప్లే' ఇప్పుడు అటు అధికారులకు, ఇటు గెలిచిన ప్రతినిధులకు పెద్ద తలనొప్పిగా మారింది.

-ముద్ర, కరీంనగర్ :




## కస్టడీకి పైలట్

అనుమతించిన కోర్టు 03



డ్రగ్స్ సరఫరా మూలాలను వెలికితీయడానికి దర్యాప్తు వేగం

మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

## బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో హోరాహోరీ..

హరీష్ రావు కౌంటర్‌కు రీ కౌంటర్ ఇచ్చిన ఉత్తమ్

- హౌస్ కమిటీ అంటూ వేస్తే హరీశ్ రావు ప్రభుత్వంలో జరిగిన ఒప్పందాల పరిశీలనకే పరిమితం కావాలి
- శాసనసభలో హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కౌంటర్ 09



# కరెంట్ కష్టం

## సింగరేణి నిర్ణయం తెలంగాణకు షాక్

- రూ.27 వేల కోట్ల బకాయిల ప్రభావం
- 800 మెగావాట్ల కరెంట్ రాజస్థాన్‌కు మళ్లింపు
- తెలంగాణకి భవిష్యత్ విద్యుత్ సంక్షోభ హెచ్చరిక
- అదనపు ఆర్థిక భారం తప్పదంటున్న నిపుణులు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** సింగరేణి సంస్థ మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో నిర్మిస్తున్న 800 మెగావాట్ల కొత్త థర్మల్ ప్లాంట్ విద్యుత్తును తెలంగాణకు కాకుండా రాజస్థాన్‌కు విక్రయించాలని నిర్ణయించింది. ఇందుకోసం రాజస్థాన్ జెన్‌కోతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ డిస్కంలు చెల్లించాల్సిన రూ. 27,379 కోట్ల భారీ బకాయిలే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. ఈ పరిణామం భవిష్యత్తులో తెలంగాణకు కరెంట్ కష్టాలతో పాటు వేల కోట్ల అదనపు ఆర్థిక భారాన్ని మోపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మిగతా 02లో

## మాజీ మంత్రి మైండ్ గేమ్

కాంగ్రెస్ వ్యతిరేకవర్గాన్ని మచ్చిక చేసుకుంటున్న బీఆర్ఎస్ 10



- పాలమూరులో వల విసురుతున్న వైనం
- చీలిన కాంగ్రెస్ నేతలతో చెట్టాపట్టాల్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల లోపు కలిపేందుకు యత్నం
- పావులు కదుపుతున్న మాజీ మంత్రి

-ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:

# యుద్ధానికి బ్రేక్

5 రోజులపాటు దాడులకు బ్రేక్.. ట్రంప్ ప్రకటన



- ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఫలితం
- పవర్ ప్లాంట్లపై దాడులు నిలిపివేత
- ట్రూత్ సోషల్‌లో ట్రంప్ వెల్లడి
- రెండు రోజుల చర్చలతో మారిన పరిస్థితి
- శాంతి దిశగా అడుగులు?
- యుద్ధ ఉద్రిక్తతల మధ్య ఊరట
- వారం మొత్తం చర్చలు కొనసాగింపు 10

ముద్ర

పాకిస్తాన్ సూపర్ లీగ్ ప్రారంభానికి ముందే విదేశీ ఆటగాళ్ల వరుస తప్పుకోవడం ఆ టోర్నీకి భారీ దెబ్బ. 8 మంది ప్లేయర్లు వ్యక్తిగత కారణాలతో వైదొలగడం.. వారంతా ఐపీఎల్ లో ఆడేందుకు రావడంతో పీసీబీకి పెద్ద షాక్‌గా మారింది.





## భయంతో వెంటనే కొనొద్దు




యుద్ధం మొదలైతే ధరలు ఒక్కసారిగా పెరుగుతాయి. అప్పుడు తొందరపడి కొనడం తప్పు.

# ఆఫర్ హరీశ్ కేనా?

(మొదటి పేజీ తరువాయి)

**సిద్దిపేటకు సీఎం ఆఫర్..?**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పర్యటన సందర్భంగా సిద్దిపేటకు మంత్రి పదవి ఆఫర్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామన్నారు. ఈ బాధ్యతను పెద్దలు దామోదర్ రాజనరసింహ, వివేక్ వెంకటస్వామి తీసుకుంటారని నేను ఈ వేదిక మీద నుంచి రేవంత్ మాటిచ్చారు. 2029 ఎన్నికలలో సిద్దిపేటలో గెలిచే కాంగ్రెస్ ఎమ్మెల్యేను వారు మంత్రిని చేస్తారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2014, 2018 సంవత్సరాల్లో కూడా మేము పోటీ పడ్డాం. ఆనాడు ప్రజలు మీకు (బీఆర్ఎస్ పార్టీకి) అధికారం ఇచ్చారు. కానీ 2023లో మీరు మేము పోటీ పడ్డప్పుడు ప్రజలు అధికారం మాకు ఇచ్చారు. అలాగే 2029లో కూడా ప్రజలు మాకే అవకాశం ఇస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సిద్దిపేట జిల్లాలోని నర్మెట్టలో జరిగిన భారీ బహిరంగసభలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హరీష్ రావును వచ్చే ఎన్నికల్లో ఓడించేందుకు కాంగ్రెస్ నేతలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు అనడానికి రేవంత్ మంత్రి పదవి ఆఫరే అందుకు నిదర్శనం.

**సిద్దిపేటలో ఒక్క ఛాన్స్ ఇవ్వండి.. సీఎం రేవంత్ రెడ్డి**

'సిద్దిపేట ప్రాంతంలో 1984 నుంచి 2029 వరకు ఒకే కుటుంబం అధికారంలో ఉంది. కనుక ఈసారి ఇతరులకు కూడా ఒక అవకాశం ఇవ్వాలని నేను కోరుతున్నాను. నాయకత్వంలో మార్పు చేసి చూడండి. మీకు ఎంత మంచి జరుగుతుందో లేదో మీకే తెలుస్తుంది. ఈ ప్రాంత ప్రజలు చైతన్యవంతులు. కనుక వచ్చే ఎన్నికల్లో విచక్షణతో ఆలోచన చేయాలని కోరుతున్నాను.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుంది. మల్లన్న సాగర్ సమస్య లేదా ఇతర సాగునీటి ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో మల్లన్న సాగర్ సమయంలో ఏటిగడ్డ కిష్టాపూర్లో నేను 48 గంటల పాటు దీక్ష చేశాను. ఆనాడు రైతుల పక్షాన నిలబడటానికి దామోదర్ రాజనరసింహ, రఘునందన్ రావు కూడా వచ్చారని' తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. అంతేకాదు.. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో విద్యా, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ రేవంత్ రెడ్డి పలు కీలక భవనాలను ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా రూ. 141.34 కోట్లతో సిద్దిపేట మున్సిపాలిటీలో చేపట్టిన నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే ఎన్సాన్‌పల్లిలో రూ. 78 కోట్లతో నిర్మించిన జిల్లా జైలు భవనం, రూ. 15 కోట్లతో ఏర్పాటు చేసిన 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రిని ఆయన జాతికి అంకితం చేశారు. ఇవే కాకుండా సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌తో పాటు నంగునూరు, అంబేద్కర్ నగర్‌లలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను కూడా సీఎం ప్రారంభించారు.

**టార్గెట్ హరీశ్ ..?**

మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు హరీశ్ రావు మీద గురి పెట్టినట్లుగా అర్థమవుతోంది. ఇటు కేసీఆర్ కూడా ఫాంహౌస్ కు పరిమితం కావడం, కేడర్‌ను పట్టించుకోకపోవడంతో గులాబీ దళం కొంత ఆయోమయంలో ఉంది. దీనికితోడు హరీశ్ రావుకు.. కేటీఆర్‌కు మధ్య గ్యాప్ ఉంది. ఇదే అవకాశాన్ని సీఎం అనుకూలంగా మల్చుకుంటున్నారనే ప్రచారం మొదలైంది. సిద్దిపేటకు మంత్రి పదవి ఆఫర్ నేపథ్యంలో ఇటీవల పరిస్థితులకు అనుగుణంగా హరీశ్ రావు తమవైపు మద్దతుగా ఉంటారని అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది.



# రేవంత్ మార్క్

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా అతడిని ప్రజల దృష్టిలో దోషిగా నిలబెట్టాలని అనుకుంటే, అది ఒక్కోసారి అతడిని రాజకీయ బాధితుడిగా మార్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కేటీఆర్, కేసీఆర్ వంటి నేతల్ని అరెస్టు చేస్తే, అది సోషల్ మీడియా యుగంలో అనూహ్యమైన సానుభూతిని నింపుతుంది. అక్రమ కేసులు పెట్టారనే ప్రచారం జరిగితే, అది బీఆర్ఎస్‌కు సంజీవనిలా మారుతుందని రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. అందుకే, ఆవేశంతో సంకెళ్లు వేయడం కంటే, ఆధారాలతో వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టడమే మేలని ఆయన భావిస్తున్నారు. కాళేశ్వరం వైఫల్యాలు, ఫోన్ ట్యాపింగ్ అక్రమాలను ప్రజల్లో నిరంతరం చర్చ జరిగేలా చూడటం ద్వారా వారి నైతిక పతనాన్ని శాశ్వతం చేయడమే రేవంత్ అసలు వ్యూహం.

**చరిత్ర నేర్పిన పాఠాలు**

తెలుగు నేల రాజకీయ చరిత్ర రేవంత్ రెడ్డి ముందు స్పష్టమైన పాఠాలను ఉంచింది. గతంలో జగన్మోహన్ రెడ్డి 16 నెలల జైలు జీవితం ఆయనకు ప్రజల్లో ఒక విధమైన సానుభూతిని, తద్వారా అధికారాన్ని తెచ్చిపెట్టింది. చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో కూడా ప్రజల్లో వెల్లువెత్తిన మద్దతు, సానుభూతి పవనాలు రాజకీయ సమీకరణాలను మార్చేశాయి. కేసీఆర్ వంటి ప్రాంతీయ సెంటిమెంట్ ఉన్న నాయకుడిని అరెస్టు చేస్తే, అది మళ్లీ తెలంగాణ ఆత్మగౌరవం అనే సెంటిమెంట్‌ను రాజేసే అవకాశం ఉంది. తన పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం పగ తీర్చుకుంటున్నారనే ముద్ర పడకుండా, రేవంత్ రెడ్డి అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.

**రాజకీయ బలహీనమే..**

నిజానికి కేటీఆర్‌ను చట్టపరమైన చిక్కుల్లో నెట్టే అవకాశాలు వచ్చినా రేవంత్ ఆచితూచి అడుగు వేయడం వెనుక ఉన్న పక్కా పొలిటికల్ లెక్క ఇదే. జైలు గోడల మధ్య ప్రత్యర్థిని ఒక పొలిటికల్ హీరోగా మార్చడం కంటే, బయటే ఉంచి వారిపై ఉన్న ఆరోపణలను ఎండగట్టడం ద్వారా వారి విశ్వసనీయతను దెబ్బతీయడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. జైలుకు వెళ్తే వచ్చే సానుభూతి కంటే, బయట ఉండి సమాధానం చెప్పుకోలేక ఇబ్బంది పడటం వల్ల కలిగే నష్టమే ప్రత్యర్థికి ఎక్కువ. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే ఆయన కేవలం ఒక దూకుడున్న నాయకుడిగానే కాకుండా, రాజకీయ చదరంగంలో ఎప్పుడు ఏ పావును కదపాలో తెలిసిన పరిణతి చెందిన నాయకుడిగా కనిపిస్తున్నారు.




**ఇమేజ్ మేనేజ్‌మెంట్**

రేవంత్ రెడ్డి వ్యూహం స్పష్టంగా ఉంది. ప్రత్యర్థులను జైలులో ఉంచి బలవంతులుగా మార్చడం కంటే, వారి తప్పులను ప్రజల ముందు ఉంచి బలహీనపరచడమే సరైన మార్గమని ఆయన నమ్ముతున్నారు. ఈ వేచి చూసే ధోరణి కాంగ్రెస్ కేడర్‌కు కొంత అసహనం కలిగించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకిమేలు చేస్తుందని ఆయన రాజకీయ లెక్కలు చెబుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులకు సానుభూతి మైలేజీ ఇవ్వకుండా, చట్టపరమైన ప్రక్రియ ద్వారానే అంతిమ తీర్పు వచ్చేలా చూడటం రేవంత్ మార్క్ గా కనిపిస్తోంది

# కాముని చెరువును పునరుద్ధరించాలి

### చెరువు పరిశీలనలో హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ముద్ర , హైదరాబాద్:** మూసాపేటలోని కాముని చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం పరిశీలించారు. రెండో విడతలో అభివృద్ధి చేయనున్న 14 చెరువులలో కాముని చెరువు కూడా భాగమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులు కమిషనర్‌ను కలిసి చెరువు పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించాలని వినతిపత్రం సమర్పించారు. కూకట్‌పల్లి నల్ల చెరువుల మాదిరిగా అభివృద్ధి చేస్తే దోమల సమస్య తగ్గి, దుర్వాసన తొలగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దోమల తీవ్రత కారణంగా ఇళ్ల తలుపులు కూడా తెరవలేని పరిస్థితి ఉందని వాపోయారు. చెరువు పునరుద్ధరణకు హెచ్ఎండీఏ నుంచి సాంకేతిక అనుమతులు రావాల్సి ఉందని, అవి అందిన వెంటనే పనులను వేగవంతం చేస్తామని అధికారులు తెలిపారు. అంతవరకు దోమల సమస్య తగ్గించేందుకు చెరువులోని మురుగు నీటిని బయటకు పంపించి, గుర్రపు డెక్కను తొలగించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కాముని చెరువు నుంచి మూసాయి కుంటకు వెళ్లే వరద కాలువ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న సాంకేతిక లోపాలను వెంటనే సరిదిద్దాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వరద ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా పనులు పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఆదేశించారు. ఈ వర్షాకాలానికి చెరువును పూర్తిగా పునరుద్ధరించి, తాజా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

# జీవో 95కు నారెడ్కో స్వాగతం

### మధ్యతరగతి గృహవసతికి, సుస్థిర పట్టణాభివృద్ధికి ఇది మైలురాయి

**ముద్ర, హైదరాబాద్:** జీవో 95ను జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, దీనికి సంబంధించిన వివరణాత్మకమైన లేఖను విడుదల చేశారు. తెలంగాణ భవన నిర్మాణ నియమావళి, 2012కు చేసిన ఈ చారిత్రాత్మక సవరణలు, పట్టణాభివృద్ధిని హేతుబద్ధీకరించడానికి, మధ్యతరగతి ప్రజలకు గృహవసతిని మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ఒక ప్రగతిశీల ముందడుగును సూచిస్తున్నాయని అన్నారు. అభివృద్ధి చెందుతున్న మహానగరం యొక్క మారుతున్న అవసరాలను నేరుగా పరిష్కరించే అసాధారణమైన "వ్యాపారం చేసే సౌలభ్యం" (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) దృక్పథాన్ని ప్రదర్శించిందని కొనియాడారు. బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కుల (టీడీఆర్) వినియోగాన్ని మెరుగుపరచడం ద్వారా, ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉన్న వాటాదారుల విజ్ఞప్తులను పరిష్కరించిందని, వేగవంతమైన ఆధునీకరణను పర్యావరణ బాధ్యతతో సమతూల్యం చేసే ఒక చట్రాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

**మధ్యతరగతి గృహ కొనుగోలుదారులకు ప్రయోజనాలు:**

ఈ సంస్కరణలు కేవలం డెవలపర్‌ల కోసమే కాదని, భవన నిర్మాణ నిబంధనల సంక్లిష్టతను తగ్గించడం, భూ వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడం ద్వారా, తెలంగాణ ప్రభుత్వం మరింత పోటీతత్వ గృహ ధరలకు మరియు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధికి మార్గం సుగమం చేస్తోందని ప్రకటించింది. టీడీఆర్‌పై దృష్టి పెట్టడం వల్ల, రోడ్ల విస్తరణ లేదా బఫర్ జోన్‌ల వలన ప్రభావితమైన భూ యజమానులు న్యాయమైన, మార్కెట్ విలువకు తగిన పరిహారం పొందేలా ఇది నిర్ధారిస్తుందని, తద్వారా మరింత సమానమైన అభివృద్ధి పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.




**మధ్యస్థాయి నిర్మాణాలకు ప్రోత్సాహం:**

750 చ.మీ నుండి 2000 చ.మీ మధ్య ఉన్న ప్లాట్ల కోసం, టీడీఆర్ వినియోగం ద్వారా 18 మీ నుండి 21మీ ఎత్తు ఉన్న భవనాలకు ప్రభుత్వం ఇప్పుడు అనుమతిస్తోంది. ఇది మధ్యస్థాయి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌ల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది, ఇవి ప్రధాన ప్రాంతాలలో నాణ్యమైన గృహాలను కోరుకునే మధ్యతరగతి కుటుంబాలకు ప్రాధాన్య ఎంపికగా ఉన్నాయి.

**సౌకర్యవంతమైన సెట్‌బ్యాక్ సడలింపులు:**

కొత్త నిబంధనలు టీడీఆర్ ద్వారా ఎత్తైనవి కాని భవనాలలో సెట్‌బ్యాక్ సడలింపులకు అనుమతిస్తాయి. ఈ సౌలభ్యం డెవలపర్‌లకు చిన్న ప్లాట్లలో స్థలాన్ని గరిష్ఠంగా వినియోగించుకోవడానికి వీలు కల్పిస్తుంది, దీనివల్ల మరింత సమర్థవంతమైన ఫ్లోర్ ప్లాన్‌లు మరియు గృహ కొనుగోలుదారులకు మరింత పోటీ ధరలు లభించే అవకాశం ఉంది.

**తక్కువ ఖర్చుతో కూడిన మౌలిక సదుపాయాల పరిష్కారాలు:**

మాస్టర్ ప్లాన్ రోడ్లను సవరించిన లేదా తొలగించిన ప్రాంతాలలో, దరఖాస్తుదారులు ఇప్పుడు అభివృద్ధి లేదా మార్పిడి ఛార్జీలకు బదులుగా సమానమైన టీడీఆర్‌ను సమర్పించవచ్చు. ప్రాజెక్టుల కోసం ముందస్తు నగదు లభ్యత అవసరాలలో ఈ తగ్గింపు ఆస్తి ధరలను స్థిరీకరించడంలో సహాయపడుతుంది.

**కోర్ ఏరియాలో సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం:**

హైదరాబాద్ కోర్ ఏరియాను సుస్థిరంగా జనసాంద్రతగా మార్చేందుకు ఇది ఒక వ్యూహాత్మక చర్య అని అభివర్ణించారు. 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను బహుళ అంతస్తుల భవనాలుగా పునర్నిర్వచించడం, ఎత్తైన నిర్మాణాలకు క్రమబద్ధమైన టిడిఆర్ లోడింగ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా, నిలువు పెరుగుదలను నిర్వహించి, అది నగరం యొక్క పునరాభివృద్ధికి దోహదపడేలా ప్రభుత్వం నిర్ధారిస్తోంది.

**క్రమబద్ధమైన నిలువు పెరుగుదల:**

10 అంతస్తుల కంటే ఎక్కువ ఉన్న బహుళ అంతస్తుల భవనాలలో ఇప్పుడు క్రమబద్ధమైన టిడిఆర్ వినియోగం ఉంటుంది (20 అంతస్తుల వరకు 3%, మరియు 20 అంతస్తుల పైన 5%). దీనివల్ల, మన స్కైలైన్ పెరుగుతున్న కొద్దీ, బఫర్ జోన్‌లు, పర్యావరణ పరిరక్షణల వల్ల ప్రభావితమైన భూమికి నష్టపరిహారం అందించే వ్యవస్థకు అది అనుసంధానమై ఉంటుంది.

**పెద్ద ప్లాట్ల అభివృద్ధికి ప్రోత్సాహకాలు:**

2000 చ.మీ. కంటే ఎక్కువ ఉన్న ప్లాట్లలో ఇప్పుడు టిడిఆర్ (TDR) వినియోగం ద్వారా రోడ్డు వెడల్పు ఆధారంగా 5 అదనపు అంతస్తుల వరకు నిర్మించుకోవచ్చు. ఇది మెరుగైన సౌకర్యాలతో కూడిన పెద్ద, మరింత వ్యవస్థీకృత నివాస సముదాయాలను ప్రోత్సహిస్తుంది. "ఈ జీవో హైదరాబాద్ పౌరులకు, పర్యావరణానికి, రియల్ ఎస్టేట్ రంగానికి ప్రగతి సాధింపజేస్తుంది" అని నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు శ్రీ విజయ సాయి మేక అన్నారు. "టీడీఆర్ ను క్రమబద్ధీకరించడం ద్వారా, ప్రభుత్వం సున్నితమైన జోన్లలో భూమిని పరిరక్షించడమే కాకుండా, మధ్యతరగతి ప్రజలకు సుసంపన్నమైన, కేంద్ర స్థానాల్లో నివసించడానికి మరిన్ని అవకాశాలను కల్పిస్తోంది" అని నారెడ్కో తెలంగాణ సెక్రటరీ జనరల్ శ్రీ శ్రీధర్ రెడ్డి కొప్పుల పేర్కొన్నారు. ప్రభుత్వం యొక్క ఈ చురుకైన మరియు సంప్రదింపుల విధానాన్ని నారెడ్కో తెలంగాణ అభినందిస్తోంది. జీవో నెం. 95 హైదరాబాద్ పట్టణ పరివర్తన యొక్క తదుపరి దశకు ఒక శక్తివంతమైన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని, మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుందని, మరియు రియల్ ఎస్టేట్ కోసం మన నగరాన్ని ఒక ప్రపంచ గమ్యస్థానంగా సుస్థిరం చేస్తుందని మేము విశ్వసిస్తున్నామన్నారు. ఈ నిబంధనలు సమర్థవంతంగా అమలు అయ్యేలా చూడటానికి, శక్తివంతమైన, సుస్థిరమైన, సమ్మిళిత రియల్ ఎస్టేట్ పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి నారెడ్కో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

# కరెంట్ కష్టం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ షాక్ ఇచ్చింది. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లిలో కొత్తగా నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ విద్యుత్తును ఇప్పుడు రాజస్థాన్‌కు విక్రయించాలని సింగరేణి నిర్ణయించింది. దశాబ్దాలుగా తెలంగాణ గనుల నుంచి బొగ్గు తీస్తూ రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచిన సింగరేణి.. ఇప్పుడు తన సొంత రాష్ట్ర డిస్కంలకు కాకుండా పొరుగు రాష్ట్రమైన రాజస్థాన్ విద్యుదుత్పత్తి సంస్థతో జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటుకు సిద్ధమవ్వడం చర్చనీయాంశంగా మారింది.

ఈ నిర్ణయం వెనుక ప్రధానంగా ఆర్థిక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ప్రస్తుతం ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు నుంచి సరఫరా అవుతున్న విద్యుత్తుకు సంబంధించి డిస్కంలు దాదాపు రూ. 27,379 కోట్ల మేర బకాయిలు పడ్డాయి. ఈ భారీ ఆర్థిక లోటు వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉండటంతో కొత్త ప్లాంటు విద్యుత్తును నగదు చెల్లింపులు సక్రమంగా చేసే ఇతర రాష్ట్రాలకు, ఓపెన్ మార్కెట్‌కు మళ్లించాలని సింగరేణి భావించినట్లు తెలిసింది. రాజస్థాన్‌కు థర్మల్ విద్యుత్ ఇచ్చి.. దానికి బదులుగా అక్కడ 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఆ కరెంటును వినియోగించుకోవాలనే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది.

**తెలంగాణకు ఇబ్బందులే**

అయితే, ఈ నిర్ణయం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. రాష్ట్రానికి అదనపు థర్మల్ విద్యుత్ అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు నిర్మాణానికి జెన్‌కోకు అనుమతి ఇచ్చింది. పెగడపల్లిలో ఇప్పటికే ఉన్న 1200 మెగావాట్ల ప్లాంటు పక్కనే కొత్త యూనిట్ నిర్మిస్తే భూసేకరణ భారం ఉండదు కాబట్టి మెగావాట్‌కు రూ. 12 కోట్ల ఖర్చుతోనే నిర్మాణం పూర్తవుతుంది. కానీ ఈ కరెంటును రాజస్థాన్‌కు అమ్మేసి భవిష్యత్తులో తెలంగాణ కోసం మరో చోట ప్లాంటు నిర్మించాలంటే మళ్లీ వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా భారం పడటమే కాకుండా, ప్రాజెక్టు పూర్తి కావడానికి ఏళ్ల సమయం పడుతుంది.

**అనుమతులపై ఆయోమయం**

మరోవైపు, పర్యావరణ నిబంధనలు కఠినతరం అవుతున్న తరుణంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు అనుమతులు రావడం కష్టతరమవుతోంది. చేతిలో ఉన్న అవకాశాన్ని వేరే రాష్ట్రానికి ధారాదత్తం చేస్తే.. భవిష్యత్తులో తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి అవసరమైన చౌక విద్యుత్ లభ్యత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. సింగరేణి టెండర్ ప్రక్రియను వేగవంతం చేస్తూ కన్సల్టెన్సీ సంస్థల కోసం ప్రకటన జారీ చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా కూడా దుమారం రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో బకాయిల సమస్యను పరిష్కరించుకుని ఈ 800 మెగావాట్ల విద్యుత్తును రాష్ట్ర అవసరాలకే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.




# లైంగికదాడి కేసులో 10 ఏళ్ల జైలు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన అత్యాచార కేసులో నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్యను దోషిగా తేల్చిన న్యాయస్థానం, అతనికి 10 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.12 వేల జరిమానా విధించింది. ఐపీసీ సెక్షన్లు 376, 506 కింద నమోదైన ఈ కేసును వికారాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు విచారించింది. పోలీసులు సమర్పించిన పక్కా సాక్ష్యాధారాల ఆధారంగా న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, కేసు విచారణలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులు, న్యాయవాదులను అభినందించారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నేరస్తులు తప్పించుకోలేరని ఆమె హెచ్చరించారు.

# బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం రాంపూర్ గ్రామంలో బాల్య వివాహానికి సంబంధించిన ఎంగేజ్మెంట్‌ను అధికారులు అడ్డుకున్నారు. 17 ఏళ్ల బాలికకు నిశ్చితార్థం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు.బాలికకు 18 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయడం చట్ట విరుద్ధమని తల్లిదండ్రులకు హెచ్చరించారు. అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న పూజారి అక్కడి నుంచి పరార్ అయ్యాడు. బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి అంగీకార పత్రం తీసుకుని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బంగారం– వెండి : దశల వారీగా కొనండి (SIP స్టైల్)

ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా కొద్ది-కొద్దిగా కొనడం మంచిది.






# భగత్ సింగ్ కు ఘన నివాళి

- ఆయన పోరాటాలు స్పూర్తిదాయకం
- ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు
- ఐజేయు కార్యదర్శి డి.సోమ సుందర్

**ముద్ర, విజయవాడ :**

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ నేత సర్దార్ భగత్ సింగ్ 95 వ జయంతి కార్యక్రమం సోమవారం సాయంత్రం స్థానిక ప్రెస్ క్లబ్లో జరిగింది. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, ఐజేయు జాతీయ సెక్రెటరీ డి.సోమసుందర్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, సామ్నా రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా రవి, సెక్రెటరీ, ఏ.సురేష్, ప్రెస్ క్లబ్ సెక్రెటరీ డి.నాగరాజు, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల యూనియన్ అధ్యక్షులు ఎన్వి రమణ, ఎస్కె మీరా, విజయవాడ నగర యూనియన్ నాయకులు రఘు తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐవి సుబ్బారావు, డి. సోమ సుందర్ లు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం వీరోచిత పోరాటాలు చేసి అతి పిన్న వయసులో అశువులు బాసిన గొప్ప దేశ భక్తుడు భగత్ సింగ్ అని, ఆయన సేవలను కొనియాడారు. నేటి యువతరానికి భగత్ సింగ్ జీవితం స్పూర్తి దాయకమని వారన్నారు. భగత్ సింగ్ భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ ఆ పోరాట యోధుని ఆశయాలు, లక్ష్యాలు మన మధ్యన నిరంతరం తిరుగుతూనే ఉంటాయన్నారు. ఆయన లక్ష్యాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఐవి. సుబ్బారావు, ఐజెయు కార్యదర్శి డి. సోమసుందర్ ప్రజలకు పిలుపునిచ్చారు.





# దానం వివాదం

- వీడని పార్టీ ఫిరాయింపులు కేసు
- దానం నాగేందర్‌కు తప్పని చిక్కులు
- స్పీకర్ తీర్పును కొట్టేయాలని పిటిషన్
- దానంతో సహా స్పీకర్ కు హైకోర్టు నోటీసులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పార్టీ ఫిరాయింపుల వ్యవహారం తెలంగాణలో మరోసారి తెరపైకి వచ్చింది. స్పీకర్ తీర్పుతో ఈ వివాదం ముగిసిందని భావిస్తున్న సమయంలో, మళ్లీ కోర్టు దాకా చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించిన కేసులో స్పీకర్ తీర్పును కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, దానం నాగేందర్‌తో పాటు అసెంబ్లీ స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో సంచలనం సృష్టించిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల కీలక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇస్తూ ఆయన తుది నిర్ణయం ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈ తీర్పుపై బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో వివాదం మళ్లీ చర్చనీయాంశమైంది. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి, అనంతరం లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా ఎంపీగా పోటీ చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్‌పై పోటీ చేసిన నేపథ్యంలో ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని కోర్టును కోరారు. స్పీకర్ ఇచ్చిన తీర్పు చట్టబద్ధం కాదని, దాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నుంచి కాకుండా ఇతర పార్టీ తరపున ఎంపీగా నామినేషన్ దాఖలు చేసిన రోజునుంచే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ సందర్భంగా కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో ఇలాంటి కేసులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ప్రస్తావించారు. ఇక స్పీకర్ తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఎమ్మెల్యేల ఫిరాయింపులపై సుప్రీంకోర్టు తాజా తీర్పులను హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం, కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్‌తో పాటు దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. దీంతో ఈ కేసులో వచ్చే పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

# కస్టడీకి పైలట్ రోహిత్‌రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి, ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమిత్ శర్మలను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. నిందితులను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ ముగ్గురిని విచారించడం ద్వారా డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలను, సరఫరాదారుల వివరాలను రాబట్టాలని పోలీసులు



భావిస్తున్నారు. ఈనేపథ్యంలోనే డ్రగ్స్ పార్టీ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? ఇంకా ఎవరెవరికి ఇందులో ప్రమేయం ఉందనే కోణంలో 'సిట్' అధికారులు తమ దర్యాప్తును వేగవంతం చేయనున్నారు.

# మీ స్థలం.. మాకు అక్కరలేదు

- మధు రిడ్జ్ రాకపోయినా గాంధీ సరోవర్ కు నష్టం లేదు
- దాన్ని ఎవరూ కొనరు.. అమ్మరు
- మూసీ బఫర్ జోన్ తో నివాసితులకే ప్రాబ్లం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం మధు రిడ్జ్ స్థలాన్ని ప్రభుత్వం తీసుకోవడం లేదని, అది 50 మీటర్ల బఫర్ జోన్‌లో ఉన్నందున భవిష్యత్తులోనూ యజమానులకు నష్టమేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో వివాదాస్పదంగా మారిన మధు రిడ్జ్ పార్క్ అపార్ట్‌మెంట్ స్థలంపై అసెంబ్లీలో స్పందించిన ఆయన, ప్రాజెక్టు నిర్మాణానికి ఆ స్థలం అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం ఆ భూమిని అడగలేదని తేల్చిచెప్పారు. మూసీ బఫర్ జోన్ కారణంగానే అపార్ట్‌మెంట్ వాసులకు సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. భూమిని స్వచ్ఛందంగా ఇస్తే వారికి పరిహారం చెల్లించి



ప్రత్యామ్నాయం చూపిస్తామని చెప్పారు.

**బఫర్ జోన్‌లోనే అపార్ట్‌మెంట్**

గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన 98 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 100 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని, అవే సరిపోతాయని సీఎం వివరించారు. 2005 06లో అపార్ట్‌మెంట్ వాసులు చిన్న నాలాగా చూపించి అనుమతులు పొందారని తెలిపారు. 2012, 2016లో జరిగిన పరిశీలనలో 50 మీటర్ల బఫర్ జోన్‌లో ఈ నిర్మాణం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అపార్ట్‌మెంట్ సగం భాగం బఫర్ జోన్‌లోనే ఉందని స్పష్టం చేశారు.

**పరిహారంపై ప్రభుత్వ స్పష్టత**

అపార్ట్‌మెంట్ వాసులకు ఉన్న అసలు సమస్య బఫర్ జోన్ మార్పు వల్లేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నిబంధనల కారణంగా భవిష్యత్తులో ఆస్తుల విలువ తగ్గి, కొనుగోలు–అమ్మకాలు జరగవని హెచ్చరించారు. ఒకవేళ అభివృద్ధి కోసం ప్రభుత్వం భూమిని స్వీకరిస్తే, యజమానులకు తగిన పరిహారం చెల్లించి ప్రత్యామ్నాయం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

**కొనుగోలుదారులకు హెచ్చరిక**

ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేయడం వల్ల భవిష్యత్తులో ప్రయోజనం ఉండదని, కొనుగోలుదారులే నష్టపోయే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ప్రాజెక్టు కోసం స్థలం అడుగుతోందన్న ప్రచారాన్ని తోసిపుచ్చుతూ, చట్టపరమైన అంశాలపైనే తమ వ్యాఖ్యలని స్పష్టం చేశారు.

**మా ఇండ్లే మాకు కావాలి: నివాసితుల నిరసన**

రంగారెడ్డి జిల్లాలోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ నివాసితులు ఇటీవల శాంతియుత నిరసన చేపట్టారు. తమ ఇళ్లను కూల్చివేయవద్దని, ఎలాంటి పరిహారం అవసరం లేదని స్పష్టం చేశారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తే సహించబోమని హెచ్చరించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, అయితే తమ ఇళ్లపై చర్యలు తీసుకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని తెలిపారు.


**ప్రభుత్వంపై ఆగ్రహం**

తమ ఇళ్లకు 'జీరో వ్యాల్యూ' ఉందని సీఎం వ్యాఖ్యానించడంపై నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను ఇప్పుడు బఫర్ జోన్ పేరుతో పనికిరాకుండా చేస్తున్నారని విమర్శించారు. బుల్డోజర్లు వస్తే వాటి కింద పడుకుంటామని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని తెలిపారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఫ్రీ జర్నీ

- సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకు ఎలివేటెడ్ కారిడార్లు
- హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం
- మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు
- మండలిలో సీఎం రేవంత్ రెడ్డి సిటీ ప్లాన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**





హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఫ్రీ జర్నీ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. నగరం నడిబొడ్డు నుంచి అన్ని ప్రాంతాలకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్ల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని మెట్రో సేవలను కూడా విస్తరిస్తున్నామని, అదనంగా 76 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన సీఎం, నగరంలో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగిందని అన్నారు. ఎక్కడా ట్రాఫిక్ నిలిచిపోకుండా ఉండేలా రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించి ప్రణాళిక రూపొందించామని చెప్పారు. బేగంపేట వద్ద పైభాగంలో విమానాలు ఎగిరే సమయంలో కింద అండర్‌పాస్ టన్నెల్ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. కేంద్ర సంస్థలతో చర్చించి అవసరమైన భూములు సేకరిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ చారిత్రక నగరమని, అనేక గొప్ప కట్టడాలు ఉన్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న ఆదాయం కారణంగా ప్రతి కుటుంబంలో వాహనాల సంఖ్య పెరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు అధికమయ్యాయని తెలిపారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నప్పటికీ, సిగ్నల్స్ వద్ద నిలిచిపోకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తూ, చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నగరంలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

**మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళిక**

రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామని సీఎం తెలిపారు. క్యూర్ (సర్వీస్ సెక్టార్), ప్యూర్ (ఇండస్ట్రియల్ సెక్టార్), రేర్ (వ్యవసాయ రంగం)గా విభజించి సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని చెప్పారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లోనే లైసెన్సుల పునరుద్ధరణకు అవకాశం కల్పించామని, పరిపాలనను ఒకే వేదిక కిందకు తీసుకొచ్చామని తెలిపారు.

**మెట్రో విస్తరణపై స్పష్టత**

మెట్రో విస్తరణలో ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాలేదని సీఎం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల కారణంగా మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రో విస్తరణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మరో 76 కిలోమీటర్ల మేర విస్తరణకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధికి అన్ని వర్గాల సహకారం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



## ప్రజలను తాగుబోతుల్ని చేసిందెవరూ..?

- మంత్రి జూపల్లి కృష్ణారావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మద్యాన్ని ప్రోత్సాహించిందెవరు?.. తెలంగాణ ప్రజలను తాగుబోతులను చేసింది ఎవరో ప్రస్తుత లెక్కలను చూస్తే తెలిసిపోతుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. 60 ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.65 వేల కోట్లకు మించి పోలేదని.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లక్షల కోట్లకు చేరిందని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడి.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.10 వేల కోట్ల లోపు ఉండేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయే నాటికి ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.36 వేల కోట్లకు పెరిగిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.2 వేల కోట్లు తగ్గిందని చెప్పారు.

# బియ్యం ఎగుమతుల్లో భారీ స్కాం

- కాకినాడ పోర్టులోనే మక్కిపోయాయి
- రైతులకు బోనస్ ఇంకెప్పుడు ఇస్తారు
- అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్ రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో బియ్యం ఎగుమతుల విషయంలో భారీ అవినీతి జరిగిందని సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అసెంబ్లీలో ఆరోపించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతుల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడిందని విమర్శించారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్‌ను ఈ ఎగుమతులకు అడ్వైజర్‌గా నియమించడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ, కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు. వాటాల వ్యవహారం తేలకపోవడంతోనే ఎగుమతులు నిలిచిపోయాయని ఆరోపించారు.

**కాకినాడ పోర్టులో ముక్కిపోతున్న బియ్యం**

సుమారు ఏడాది కాలంగా 7,500 టన్నుల



బియ్యం కాకినాడ పోర్టులోనే నిల్వ ఉండిపోయిందని, అవి పురుగులు పట్టి ముక్కిపోతున్నాయని హరీశ్ రావు తెలిపారు. ఇంతటి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లై శాఖలో జరిగిన అక్రమాలపై హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిస్తామని హెచ్చరించారు.

**రైతుల బోనస్‌పై ప్రశ్నలు**

యాసంగి వరి పంటకు ప్రకటించిన బోనస్ ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే అడ్వైజర్ల సలహాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. నిరసనగా సభలో బైఠాయించి ఆందోళన చేపట్టారు.

**రిటైర్డ్ ఉద్యోగులపై బీఆర్ఎస్ ఆగ్రహం**

రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో ఆలస్యం, పీఆర్సీ, డీఏ, సీపీఎస్ అంశాల్లో నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు.

**ఆర్టీసీ సమస్యలపై గట్టిగా నిలదీత**

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కూడా హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. మహిళల ఉచిత ప్రయాణ పథకం వల్ల ఆదా అయిన నిధులను ఆర్టీసీకి చెల్లించారా లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ లాభాల్లో ఉందా, నష్టాల్లో ఉందా అనే అంశంపై మంత్రి సమాధానం చెప్పాలని కోరారు.

**బకాయిలు, పీఆర్సీ అమలు పై ప్రశ్నలు**

ఆర్టీసీ కార్మికులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్, ఏరియర్స్, సీసీఎస్ బకాయిలను ఎందుకు పెండింగ్‌లో ఉంచారో వివరించాలని హరీశ్ రావు ప్రశ్నించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కొత్త పీఆర్సీని ఎప్పటి నుంచి అమలు చేస్తారో తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం ఉద్యోగుల హోదాపై స్పష్టత ఇవ్వాలని కోరారు.


**యూనియన్లు, బస్సుల కొరతపై ఆందోళన**

ఆర్టీసీ యూనియన్ల పునరుద్ధరణపై కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సుల కొరత తీవ్రంగా ఉందని, ముఖ్యంగా సిద్దిపేట వంటి డిపోల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




# టి.బి.పై అవగాహనతోనే విజయం

ప్రతీ సంవత్సరం మార్చి 24న ప్రపంచవ్యాప్తంగా టి.బి. అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటారు. క్షయవ్యాధి (టి.బి.) గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 1882 మార్చి 24న శాస్త్రవేత్త రాబర్ట్ కొచ్ టి.బి.కి కారణమైన బ్యాక్టీరియాను కనుగొన్న సందర్భంగా ఈ రోజును గుర్తుగా జరుపుకుంటున్నారు.టి.బి. అనేది మైకోబాక్టీరియం ట్యూబర్‌కులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ముఖ్యంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. అయితే కొన్నిసార్లు శరీరంలోని ఇతర భాగాలను కూడా ప్రభావితం చేయవచ్చు. ఈ వ్యాధి దగ్గు, తుమ్ము ద్వారా గాలిలో వ్యాపిస్తుంది. అందువల్ల ఇది ఒక వ్యక్తి నుండి మరొకరికీ సులభంగా సంక్రమిస్తుంది.టి.బి.కి ప్రధాన లక్షణాలు మూడు వారాలకు పైగా దగ్గు రావడం, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, రక్తంతో దగ్గు రావడం వంటి లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా అవసరం. ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభంగా ఉంటుంది. టి.బి. నివారణలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దగ్గు లేదా తుమ్ము వచ్చినప్పుడు నోరు కప్పుకోవడం, గాలి సరిగా వచ్చే ప్రదేశాల్లో ఉండడం, పోషకాహారం తీసుకోవడం వంటి చర్యలు ఈ వ్యాధి వ్యాప్తిని తగ్గిస్తాయి.అలాగే ప్రభుత్వం అందిస్తున్నబిసిజి టీకా చిన్నపిల్లలకు రక్షణ కల్పిస్తుంది. టి.బి. పూర్తిగా నయం అయ్యే వ్యాధి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స అందుబాటులో ఉంది. అయితే వైద్యులు సూచించిన విధంగా మందులు పూర్తిగా తీసుకోవడం చాలా ముఖ్యం. మధ్యలో మందులు ఆపేస్తే వ్యాధి మళ్లీ తీవ్రంగా మారే అవకాశం ఉంటుంది. అలాగే డ్రగ్ రెసిస్టెంట్ టి.బి. వంటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడవచ్చు. టి.బి.పై సమాజంలో ఉన్న అపోహలు కూడా ఒక పెద్ద సమస్య. ఈ వ్యాధి వచ్చిన వ్యక్తులను దూరంగా పెట్టడం, వివక్ష చూపడం వంటి చర్యలు తప్పు. వారికి సహాయం చేయడం, ప్రోత్సహించడం అవసరం. అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో సరైన సమాచారం చేరేలా చేయాలి.ప్రభుత్వం మరియు ఆరోగ్య సంస్థలు టి.బి. నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. "ఎండ్ టి.బి" అనే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా చర్యలు చేపడుతోంది. ప్రజల సహకారం ఉంటేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది.,టి.బి. ఒక ప్రమాదకరమైన వ్యాధి అయినప్పటికీ, సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ టి.బి.పై అవగాహన పెంచుకొని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించడానికి కృషి చేయాలి.

ఇట్లు
ఆళవందార్ వేణు మాధవ్
8686051752,హైదరాబాద్

# క్షయ రహిత భారతమే మన లక్ష్యం కావాలి !

**(24 మార్చి "ప్రపంచ క్షయవ్యాధి దినం" సందర్భంగా)**



"మైకోబ్యాక్టీరియమ్ ట్యుబర్క్యులోసిస్" బ్యాక్టీరియా గాలి ద్వారా ఊపిరితిత్తులకు సోకడంతో కలిగే ప్రమాదకర అంటువ్యాధిని "క్షయ" లేదా "ట్యుబర్క్యులోసిస్ (టిబీ)" వ్యాధిగా పిలుస్తున్నాం. క్షయ రోగులు దగ్గడం, తుమ్మడం, చీమిడి తీయడం, ఉమ్మి వేయడం లాంటి కారణాలతో ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుంది. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనదిగా గుర్తింపు పొందిన క్షయ వ్యాధిని నయం చేయడానికి, నివారించడానికి వీలు ఉన్నప్పటికీ అవగాహన లోపంతో ప్రపంచవ్యాప్తంగా అనేక నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇలాంటి తీవ్ర పరిణామాలకు కారణమవుతున్న క్షయ పట్ల పూర్తి అవగాహన కల్పించటానికి 1982 నుంచి ప్రతి ఏట 24 మార్చిన "ప్రపంచ క్షయ దినం" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ టిబీ దినం ఇతివృత్తంగా "అవును ! టిబీని అంతం చేయవచ్చు : ప్రపంచ దేశాల నాయకత్వం, చైతన్యవంతమైన ప్రపంచ మానవాళి సహకారంతో" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. టిబీ నివారణకు ఔషధనిరోధకత కూడా అడ్డుపడుతున్నది.

**ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల టిబీ రోగులు:**

అంతర్జాతీయ స్థాయిలో టిబీ నివారణకు నిధుల కొరత వల్ల 2030 వరకు ఈ అంటు వ్యాధి అంతానికి విఘాతం ఏర్పడుతున్నది. క్షయ రోగంతో ప్రాణ నష్టం, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ప్రతికూల పరిణామాలు జనిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో 170 కోట్ల మంది టిబీ బారిన పడ్డట్లు గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. భారత్‌లో 2.6 మిలియన్ల టిబీ రోగులు ఉండగా, ప్రతి లక్ష జనాభాలో 188 మంది చనిపోవడం కూడా జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 25 శాతం మంది టిబీ బారిన పడినట్లు కూడా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేటికీ అత్యధిక ప్రాణాలు తీస్తున్న టిబీ వ్యాధికి చికిత్స, నివారణ మార్గాలు ఉన్నాయని గమనించాలి.

**టిబీ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు:**

క్షయ వ్యాధిగ్రస్తుల్లో దగ్గు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, అలసట, జ్వరం, రాత్రి చెమట పట్టడం, అతి వణుకు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. క్షయ నివారణ మార్గాల్లో వ్యాధి సోకిన వ్యక్తులు దగ్గినపుడు నోటిని కండువా కప్పుకోవడం, చేతులను తరుచుగా శుభ్రం చేసుకోవడం, ఆరోగ్యకర జీవనశైలి పాటించడం, సరైన వైద్య చికిత్స పొందడం, పోషకాహారం తీసుకోవడం, సరిగ్గా నిద్ర పోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ప్రమాదకర వ్యాధికి సరైన చికిత్స ఉందని, నివారణ మార్గాలు పాటించాలని తెలుసు కోవాలి. అనాదిగా మానవాళిని పట్టి పీడుస్తున్న టిబీ వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలు పోతాయని గమనిస్తూ, రోగులకు సరైన చికిత్సతో పాటు ఇతరులకు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం, అవగాహన గొడుగుతో క్షయకు చరమగీతం పాడడం సత్వరమే జరగాలి. ఈ చర్యలను తీసుకున్నపుడు తప్పకుండా క్షయ నివారణ సుసాధ్యం అవుతుందని, వ్యాధి కట్టడికి తగు నిధులు కేటాయించాలని, నివారణ చర్యలను నిర్ధిష్టంగా తీసుకోవాలని, ఈ యజ్ఞంలో మనందరం మానవహారంగా పట్టడానికి సిద్ధంగా ఉందాం. క్షయ కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.



డా: బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

# యువతకు నవశకం.. క్రీడల్లో విశ్వవేదికపై తెలంగాణ

## రేవంత్ రెడ్డి గారి దార్శనికతకు బడ్జెట్ అద్దం





రేవంత్ రెడ్డి రి దార్శనికతకు బడ్జెట్ అద్దం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు యువతే అసలైన దిశానిర్దేశకులు మరియు మన ప్రగతి రథానికి వారే అసలైన ఇంధనం. వారిలోని అపారమైన శక్తిని గుర్తించి, దానికి సరైన నైపుణ్యాలను మరియు అవకాశాలను జోడించి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే ప్రస్తుత ప్రజా ప్రభుత్వ పరమ లక్ష్యం. మార్చి 20, 2026న ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు శాసనసభలో ప్రవేశపెట్టిన ₹3,24,234 కోట్ల భారీ బడ్జెట్ కేవలం అంకెల కుప్ప మాత్రమే కాదు; ఇది ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి దార్శనిక నాయకత్వంలో యువతకు మరియు క్రీడాకారులకు అందించిన ఒక పటిష్టమైన 'అభయ హస్తం'. గత పదేళ్ల పాలనలో నిరాశకు మరియు నిస్పృహకు గురైన యువతలో ఈ బడ్జెట్ కొత్త ఆశలను, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ముఖ్యంగా యువజన సర్వీసులు మరియు క్రీడారంగాలకు ఈ బడ్జెట్‌లో లభించిన ప్రాధాన్యత, మరియు ఈ శాఖల బాధ్యతలను నిర్వహిస్తున్న మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారి పర్యవేక్షణలో చేపట్టిన కార్యక్రమాలు ప్రభుత్వం ఈ వర్గాల పట్ల కలిగి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను పరిశీలిస్తే, తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP) 10.7% వృద్ధి రేటుతో ₹17,82,198 కోట్లకు చేరుకోవడం శుభపరిణామం. దేశ సగటు వృద్ధి రేటు 8% కంటే మన రాష్ట్రం 2.7% ఎక్కువగా నమోదు కావడం ద్వారా, తెలంగాణ దేశానికి ఒక బలమైన 'గ్రోత్ ఇంజిన్'గా నిలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బాధ్యతలు చేపట్టిన నాటి నుండి యువతకు ఉపాధి కల్పించడమే ప్రథమ ప్రాధాన్యతగా భావించారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువత అనుభవించిన వేదన వర్ణనాతీతం; రాజ్యాంగబద్ధ సంస్థ అయిన TGPSC లో జరిగిన పరీక్షా పత్రాల లీకేజీలు నిరుద్యోగుల జీవితాలను అంధకారంలోకి నెట్టాయి. ఈ అరాచకాలను అంతం చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం TGPSCని UPSC స్థాయిలో పునర్వ్యవస్థీకరించి, పారదర్శకతకు పెద్దపీట వేసింది. ఫలితంగా, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే 67,763 మంది నిరుద్యోగులకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేయడం ఒక చారిత్రాత్మక ఘట్టం. సివిల్ సర్వీసెస్ సాధించాలనే లక్ష్యంతో ఉన్న పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి గారు 'రాజీవ్ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా సివిల్స్ మెయిన్స్ రాసిన అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించగా, 20 మంది యువకులు UPSC ఫలితాల్లో ర్యాంకులు సాధించి తెలంగాణ సత్తాను చాటిచెప్పారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలతో సరిపోదని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉండాలని ముఖ్యమంత్రి గారు 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని స్థాపించారు. పరిశ్రమల భాగస్వామ్యంతో యువతను ప్రపంచ స్థాయి ఉద్యోగాలకు సిద్ధం చేయడమే దీని లక్ష్యం. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ATC) ఉన్నతీకరించగా, శిక్షణ పొందే ట్రైనీలకు నెలకు ₹2,000 స్టైపెండ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.యువజన సర్వీసులు మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారి ఆధ్వర్యంలో క్రీడారంగం నేడు కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ గడ్డపై క్రీడా విప్లవానికి బాటలు పడ్డాయి. గతేడాది డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో ప్రపంచ ఫుట్‌బాల్ రారాజు లియోనెల్ మెస్సీని తీసుకురావడం ద్వారా ప్రభుత్వం తన క్రీడా చిత్తశుద్ధిని నిరూపించుకుంది. ముఖ్యమంత్రి గారు స్వయంగా ఆ మ్యాచ్‌లో పాల్గొని యువతలో స్ఫూర్తిని రగిలించగా, మంత్రి వాకిటి శ్రీహరి గారు అట్టడుగు స్థాయి నుండి ప్రతిభను గుర్తించేందుకు మెస్సీ బృందంతో ప్రత్యేక 'ఫుట్‌బాల్ క్లినిక్' ఏర్పాటును పర్యవేక్షించారు. ఇది రేపటి తెలంగాణ ఛాంపియన్ల తయారీకి వేసిన బలమైన పునాది. రాష్ట్రాన్ని 2047 నాటికి దేశానికే 'స్పోర్ట్స్ క్యాపిటల్'గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం 9 కీలక అవగాహన ఒప్పందాలు (MoU) కుదుర్చుకోవడమే కాకుండా, నైపుణ్యాల పెంపునకు 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ మరియు స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ప్రభుత్వం ప్రారంభించింది. గచ్చిబౌలిలో ప్రతిష్టాత్మక 'మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్'ను నిర్వహించడం ద్వారా మన స్టేడియాల నాణ్యతను ప్రపంచానికి నిరూపించాం. చిన్న వయసులోనే ప్రతిభను గుర్తించేందుకు 40 క్రీడా విభాగాల్లో 'సీఎం కప్' (CM CUP) టోర్నమెంట్లను మంత్రిత్వ శాఖ సమర్థవంతంగా నిర్వహిస్తోంది.పర్యాటక రంగం మరియు క్రీడల కలయికతో రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు 'తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030'ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ విధానం ద్వారా ₹25,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం లభించింది. ఈ బడ్జెట్‌లో పర్యాటక రంగానికి ₹1,224 కోట్లు కేటాయించగా, 2027 లో జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ₹500 కోట్లు ప్రాథమికంగా కేటాయించారు. ముఖ్యమంత్రి గారి మానస పుత్రిక అయిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' 30 వేల ఎకరాలలో విస్తరించి యువతకు అత్యున్నత ఉపాధి మరియు క్రీడా వేదికగా మారనుంది. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీ అంతర్జాతీయ పర్యాటక మరియు పారిశ్రామిక కేంద్రంగా ఈ నగరాన్ని నిలబెట్టబోతోంది. ముఖ్యమంత్రి గారి జపాన్, సింగపూర్ మరియు దావోస్ పర్యటనల ద్వారా ఆకర్షించిన లక్షల కోట్ల పెట్టుబడులు యువత భవిష్యత్తును బంగారుమయం చేయనున్నాయి. దావోస్‌లో ఆవిష్కరించిన 'నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ' ద్వారా 2030 నాటికి లక్షలాది ఉద్యోగాలు లభిస్తాయి.రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించేందుకు జూన్ 2, 2026 నుండి 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ప్రారంభించి, 1.15 కోట్ల కుటుంబాలకు ₹5 లక్షల జీవిత బీమా అందిస్తున్నారు. ఇది ఏ అభివృద్ధి చెందిన దేశానికీ సాధ్యంకాని రీతిలో ప్రవేశపెట్టిన మహత్తర పథకం. విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులు తీసుకొస్తూ, అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేశంలోనే తొలిసారిగా ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మరియు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది విద్యార్థుల పోషణ మరియు విద్యా ఫలితాలను మెరుగుపరచడానికి వేసిన సరికొత్త అధ్యాయం. "పిల్లల భవిష్యత్తు కోసం తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ ఖర్చుకాదు అవి పెట్టుబడులు" అనే ముఖ్యమంత్రి గారి మాటలే ప్రభుత్వానికి నిరంతర మార్గదర్శకం.ముగింపులో చెప్పాలంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మరియు మంత్రి వాకిటి శ్రీహరి గారి పర్యవేక్షణలో తెలంగాణ యువత నేడు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తోంది. ఈ బడ్జెట్ ప్రతి అంకెలోనూ యువత ఆకాంక్షలు మరియు క్రీడాకారుల కలలు దాగి ఉన్నాయి. చదువు, నైపుణ్యం, ఉపాధి మరియు క్రీడలు.. ఇలా ప్రతి అడుగులోనూ ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. అభివృద్ధి మరియు సంక్షేమానికి పెద్దపీట వేసి, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న ఈ బడ్జెట్ తెలంగాణ భవిష్యత్తుకు ఒక పటిష్టమైన దిక్సూచి. యువత శక్తిని రాష్ట్ర ప్రగతికి ఇంధనంగా మార్చుకుంటూ మనం కలలు గన్న సుసంపన్నమైన తెలంగాణను నిర్మించే దిశగా మన ప్రయాణం కొనసాగుతుంది.

- ఎన్. పురుషోత్తం
సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ సామాజిక విశ్లేషకులు.

# యుకె : విద్యా సామ్రాజ్యవాదం బహుజన విముక్తికి ఆటంకం




మన దేశంలో విద్యను బహుజనులకు దూరం చేయడం చారిత్రకం. బ్రాహ్మణీయ వర్ణ వ్యవస్థ శూద్రఅతిశూద్రులను (బహుజన సమాజం) చదువు నుంచి దూరం చేసి, గురుకులాల ద్వారా ఆధిపత్యానికి సాధనంగా మలిచింది. స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగం సమానత్వం, రిజర్వేషన్లు వాగ్దానం చేసినా, నియోలిబరల్ ప్రైవేటీకరణ ద్వారా ఆ దమనం కొత్త రూపంలో వచ్చింది. ఇప్పుడు యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె ) వంటి సామ్రాజ్యవాద శక్తులు దీనిని తమ పెట్టుబడి లాభం కోసం ఉపయోగించుకుంటున్నాయి. ఇది కుల దమనం మరియు తరగతి దోపిడీ యొక్క సమ్మేళనం - బ్రాహ్మణీయపెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం యొక్క ఆధునిక అవతారం. యుకె ప్రభుత్వం 2030 నాటికి విద్యా ఎగుమతులను 40 బిలియన్లు (సుమారు ₹4,32,000 కోట్లు, ప్రస్తుత వినిమయ రేటు ~108 రూ./పౌండ్ ప్రకారం) చేయాలని లక్ష్యం పెట్టుకుంది. ఇది కేవలం "ఎగుమతి" కాదు - విద్యను వస్తువుగా (commodity) మార్చి, గ్లోబల్ క్యాపిటల్ మార్కెట్‌గా మలచడం. దేశాన్ని "కేంద్రీకృత అభివృద్ధి మార్కెట్"గా చూడటం అంటే 140 కోట్ల జనాభాలో ఎక్కువమంది పేదమధ్యతరగతి (మెజారిటీ శూద్రబహుజనులు)ను లక్ష్యంగా చేసుకోవడం. ఇది వారి ఆర్థిక బలహీనతలు, కలలు, భవిష్యత్తును లూటీ చేసే వ్యూహం. యుకె యూనివర్సిటీలు (లంకాస్టర్, సర్రే, సౌతాంప్టన్ వంటివి) భారతంలో క్యాంపసులు ఏర్పాటు చేస్తున్నాయి -యుజిసి 2023 రెగ్యులేషన్స్ కింద టాప్ 500 గ్లోబల్ యూనివర్సిటీలకు అనుమతి ఇచ్చారు. ఇది "అంతర్జాతీయ విద్య" కాదు; బ్రిటిష్ విద్యా బ్రాండ్‌ను స్థానికంగా అమ్మి లాభం పొందడం. రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాలు పబ్లిక్ యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేసి, సీట్లు తగ్గించి, రిజర్వేషన్లను బలహీనపరచిన తర్వాత ఈ ఖాళీని విదేశీ క్యాపిటల్ భర్తీ చేస్తోంది. రిజర్వేషన్లు లేని ఈ విదేశీ క్యాంపస్‌లు సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తూ, కేవలం ఎలైట్ వర్గాల ఆధిపత్యాన్ని శాశ్వతం చేస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు - నియోలిబరల్ రాజ్యం రూపొందించిన దోపిడీ మార్గం. యుకె యూనివర్సిటీలు నిజంగా కొన్ని మంచి లక్షణాలు కలిగి ఉన్నాయి: పరిశ్రమసంబంధిత కోర్సులు, ప్రాజెక్టులు, విమర్శాత్మక ఆలోచన, విభిన్న నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థుల సహకారం. కానీ ఈ నాణ్యత శూద్రబహుజన యువతకు అందుబాటులో ఉందా? లేదు. ఫీజులు అత్యధికం (యుజి : 10,000-20,000/సంవత్సరం, పిజి మరింత ఎక్కువ), లివింగ్ కాస్ట్ 900-1,400/నెల (లండన్‌లో ఎక్కువ). భారతంలోని క్యాంపసుల్లో కొంత తగ్గినా, అవి టాప్ ప్రైవేట్ ఇండియన్ కాలేజీల ఫీజులకు సమానంగా ఉంటాయి - పేద బహుజన యువతకు అందని స్థాయి. భారీ విద్యా రుణాలు యువతను విప్లవ పంథా నుంచి మళ్ళించి, జీవితాంతం కార్పొరేట్ కొలువుల్లో "అప్పుల బానిసలుగా" మారుస్తున్నాయి. ఇది ఎలైట్ (ఎగువ కులాలు, ధనిక తరగతులు) మార్కెట్ విస్తరణ మాత్రమే. ఇది సామ్రాజ్యవాదం యొక్క ఆధునిక రూపం. పాత కాలంలో ముడి పదార్థాలు (పత్తి, టీ) దోచుకున్నారు. ఇప్పుడు యువత భవిష్యత్తు, కలలు, విద్యా అప్పులను దోచుకుంటున్నారు. విదేశీ విద్య బ్రెయిన్ డ్రెయిన్‌కు దారి తీస్తుంది - భారత్‌లోని నైపుణ్యం గ్లోబల్ క్యాపిటల్‌కు సేవ చేస్తుంది. ఇక్కడి ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలు (జిఎటిఎస్ / డబ్ల్యుటిఒ ద్వారా విద్యను వాణిజ్యం చేయడం) ఈ లూటీకి అంతర్జాతీయ ముద్ర వేస్తాయి. పబ్లిక్ యూనివర్సిటీల విస్తరణ, ఉచితనాణ్యమైన విద్య (ప్రాథమిక నుంచి ఉన్నత విద్య వరకు). విద్యకు జిడిపిలో 15% నిధులు కేటాయించాలి. రిజర్వేషన్ల పూర్తి అమలు చేయాలి. కేవలం సీట్లలో కాదు - ఫ్యాకల్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీసెర్చ్‌లో కూడా సామాజిక న్యాయ సూత్రాలు వర్తించాలి. ప్రైవేటీకరణ, విదేశీ క్యాంపసుల వ్యతిరేక సామూహిక సంఘర్షణ - విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, బహుజన సంఘాలు ఏకమవ్వాలి. విద్యను మార్కెట్ కాకుండా సామాజిక విముక్తి సాధనంగా చూడాలి. కులవర్గ సంఘర్షణను గుర్తించి, శూద్రబహుజన యువతను విప్లవ శక్తిగా నిలబెట్టాలి. లేకపోతే, యువత శాశ్వత ఆధునిక బానిసలుగా, గ్లోబల్ క్యాపిల్ సేవకులుగా మిగిలిపోతారు. కనుక నిజమైన విముక్తి కోసం విద్యా విప్లవం - ప్రజల చేతుల్లోకి విద్య రావాలి. రాజ్యం యొక్క ప్రస్తుత నియోలిబరల్ నమూనాను స వా లు చేయడం నేటి అవసరం.





- పాపని నాగరాజు
(సత్యశోధక మహాసభ)

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

మంగళవారం 24.03.2026

www.mudranews.in | @mudranews





బంగారం– వెండి

ధరల ట్రెండ్ గమనించండి

అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ఎలా మారుతుందో చూసి నిర్ణయం తీసుకోండి.




## స్పీకర్ ను కలిసిన విప్



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పార్టీ నాయకత్వం, సీఎం రేవంత్ రెడ్డి తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చారని, వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం దృష్ట్యా అసెంబ్లీ కార్యకలాపాలు సజావుగా జరిగేలా కృషి చేస్తానని, సభా నిర్వహణలో స్పీకర్ మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రజా సమస్యలను సభలో బలంగా ప్రతిపాదిస్తూ ప్రజల గొంతుకగా నిలబడటానికి కట్టుబడి ఉన్నానని, ప్రజాసేవను మరింత నిబద్ధతతో ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ గా నియామకం పొందిన ఎమ్మెల్యే యెన్నంకు స్పీకర్ అభినందనలు తెలిపారు.

## ప్రజావాణికి తొమ్మిది ఫిర్యాదులు

**–జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజల నుంచి 9 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో భూమికి సంబంధించినవి రెండు, తగు న్యాయం కోసం ఐదిi, కుటుంబ తగాదాలకు సంబంధించినవి రెండు ఫిర్యాదులున్నాయి. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ ఐలు, సీఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల స్థితిగతులను తెలుసుకొని, పరిష్కారానికి మార్గనిర్దేశం చేశారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా, మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, శాంతి భద్రతలను కాపాడటమే లక్ష్యమన్నారు.

## పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ దేపాక్ తివారి సోమవారం సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, జి.వీ శ్యామ్ ప్రసాద్ లాల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి అదనపు కలెక్టర్లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చిన సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ రోజు ప్రజావాణికి మొత్తం 34 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో 133 ఫిర్యాదులు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 135 పిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి, జడ్ పి సిఈఓ సుధీర్, డి ఆర్ ఓ మంగీ లాల్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్ డి ఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

ప్రజావాణికి ప్రతి వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని పరిష్కరించకుండా అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవో తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి









మొత్తం 56 ఆర్జీలు వచ్చాయన్నారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్ లో ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణికి సంబంధించి 435 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఆర్జీలను పెండింగులో పెట్టొద్దు

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖ 10, ఇతర శాఖలు 43, మొత్తం 53 దరఖస్తులు అందినట్లు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అధికారులు పాల్గొన్నారు.

**ముద్ర, నారాయణ పేట :**

ప్రజావాణి సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఫిర్యాదుదారుల నుంచి వినతుల స్వీకరించారు. 37 ఫిర్యాదులు రాగ వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## మున్సిపల్ పరిధిలో దుకాణాలు సీజ్



**ముద్ర, తాండూర్:**

వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించకుండా ఉన్న మొండి బకాయి దారుల పట్ల మున్సిపల్ సిబ్బంది కఠిన చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ టీం, బిల్ కలెక్టర్లు జవాన్లు షాపులకు వెళ్లి తాళాలు వేశారు. పోట్లీ మహారాజ్ దేవాలయానికి సంబంధించి షాపులలో సీజ్ చేశారు. పలు దుకాణాలు ప్రైవేటు ప్రాపర్టీలకు సంబంధించి మొండి బకాయిదారులకు సైతం రెడ్ నోటీసులు అందిస్తూ పన్నులు సకాలంలో కట్టకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. టాక్సులు చెల్లించకపోతే మున్సిపాలిటీ గ్రాండ్లు నిలిచిపోయే అవకాశం ఉందని వివరించారు. పట్టణ ప్రజలు టాక్సులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మేనేజర్ నరేందర్ రెడ్డి, ఆర్ ఐ రాములు, బిల్ కలెక్టర్ నాగేందర్, కపిల్, వాడా ఆఫీసర్ గోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**ముద్ర, గద్వాల:**

కేటిదొడ్డి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కేటిదొడ్డి తహసీల్దార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ కరుణాకర్ ప్రారంభించారు. ఎంపీడీఓ రమణరావు, అర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, జీపీఓలు పాల్గొన్నారు.

# చేనేత హస్తకళ మేళా ప్రారంభం

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



మహబూబ్ నగర్లోటని శిల్పరామంలో సోమవారం చేనేత వస్త్రాలు, హస్తకళ మేళా ప్రారంభమైంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ,గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ సరస్ ఫెయిర్ జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా, నగర మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆర్టిఫిషియల్ ఆభరణాలు, హెర్బల్ ప్రొడక్ట్స్ వాడకంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే సహకారంతో చేనేత కార్మికుల ఉత్పత్తులకు, విక్రయాలకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు సందర్శించారు. ముడా చైర్మన్ లక్ష్మన్ యాదవ్, జిల్లా గ్రంథాలయం చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, జిల్లా ఎస్ పి జానకి, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్‌లు

### అక్రమ అరెస్ట్ లతో రాక్షస పాలన



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అమలు చేయడం లేదని చేపట్టిన నిరసన కార్యక్రమాలను అడ్డుకుని అక్రమ అరెస్టులు చేయడాన్ని బిజెపి వికారాబాద్ నియోజకవర్గం కోఆర్డినేటర్ వడ్ల నందు విమర్శించారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్రేపల్లి కౌన్సిలర్ స్రవంతి శ్యాంరెడ్డి, పెండ్లిమడుగు సర్పంచ్ సంతోష బుచ్చయ్య, మాజీ సర్పంచ్ బుచ్చి రెడ్డి, మైలార్ దేవరంపల్లి ఉప సర్పంచ్ భర్త బస్వలింగం, మల్లారెడ్డి, రాఘవేందర్, నాయకులు పాల్గొన్నారు.

**ముద్ర, గద్వాల:**

కేటిదొడ్డి పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తుందని బిజెపి కేడిదొడ్డి మండల అధ్యక్షులు శ్రీపాదరెడ్డి అన్నారు. గఓబిసి అధ్యక్షులు ముంగిలి వీరెష్, నాయకులు బీమ్ రెడ్డి, హన్మి రెడ్డి, నాగిరెడ్డి, దేవేందర్ రెడ్డి, డి. వేరేష్,కొండన్న, జమ్మన్న, గోపాల్ , పవన్ కుమార్, తదితరులు ఉన్నారు.

### మాధవరం కాంతారావు అరెస్టు

**ముద్ర, కూకట్‌పల్లి:**

కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్చార్జ్ మాధవరం కాంతారావును 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమానికి వెళ్లకుండా, ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

# జూరాల కుడికాలువలో రాళ్లు

### అడ్డంకులు సృష్టిస్తున్న రైతులు

**ముద్ర, గద్వాల:**



గద్వాల మండలం ప్రవహిస్తున్న జూరాల కుడి కాలువ పైభాగంలో డిస్ట్రిబ్యూటరీ నంబర్ 12(పిల్ల కాలువ) బీరొళ్లు గ్రామం వద్ద కొందరు రైతులు స్వార్థంతో కాలువలో పెద్దపెద్ద రాళ్లు, మట్టి బస్తాలు వేసి అడ్డంకులు సృష్టిస్తున్నారు. దీనివల్ల కుడి కాలువ పై ఆదారపడి ఉన్న అనంతపురం, బస్రాచెర్వు తదితర గ్రామాల రైతాంగానికి పూర్తి స్థాయిలో సాగు నీరందడం లేదు. దిగువన ఉన్న వందలాది ఎకరాల పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎంతో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికందే దశలో ఎండిపోతున్నాయని దిగువ ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటి చర్యలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు వెంటనే అధికారులు స్పందించి అడ్డంకులను తొలగించకపోతే పంటలు పూర్తిగా దెబ్బతింటాయి అని ఆయకట్టు రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని, కాలువలోని అడ్డంకులను తొలగించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన పక్షంలో ఆందోళన బాట పడతామని వారు హెచ్చరిస్తున్నారు.

# విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

**ముద్ర, తాండూర్:**




మారుతున్న కాలనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందిచుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆర్బిఎల్ ఎండి బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాండూర్లోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఎంసెట్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. హిందూ ధార్మిక పరిషత్ గౌరవ అధ్యక్షులు కరణం పురుషోత్తం రావు, తాండూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టి నరేందర్ సార్, ఎంసెట్ కోచింగ్ కన్వీనర్ పర్యాద రామకృష్ణ, హిందూ ధార్మిక పరిషత్ సభ్యులు ఓం ప్రకాష్ సోమని, వినోద్ జైన్, పటేల్ విజయ్ కుమార్, జయంత్, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### రోడ్ల నిర్మాణం చేపట్టాలి

**ముద్ర, నారాయణ పేట :**

నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం సింగారం మలుపు దారి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. అలాగే భవన సముదాయానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను అక్కడి నుంచి తొలగించి కొద్ది దూరంలో ఏర్పాటు చేయాలని సూచించారు. భవనం చుట్టూ నాలుగు వైపులా మొక్కలు పెట్టి గ్రీనరీ ఏర్పాటు చేయాలని డీఆర్డీవో మొగులప్పకు చెప్పారు.

### స్పీకర్ ఎన్ని నిధులు తెచ్చారు.?

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

బడ్జెట్లో వికారాబాద్ కు ఎన్ని నిధులు తీసుకువచ్చారో స్పీకర్ ప్రసాద్ గడ్డం కుమార్ చెప్పాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గోపాల్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు.

### 25న హజ్ యాత్రికులకు టీకాలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

హజ్ యాత్రకు సిద్ధమవుతున్న యాత్రికుల కోసం ఈనెల 25న జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ తెలిపారు. రాష్ట్ర హజ్ సొసైటీ మరియు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో, యాత్రికులకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన టీకాలు అందించనున్నారు. అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్ కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన హజ్ యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాస్పోర్ట్ కాపీ కవర్ నెంబర్ జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, పాత మెడికల్ రిపోర్టులు తీసుకురావాలని, వివరాలకు 91545 61788, 99128 73342, 90525 42716 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

### ఉచిత గాలికుంటు టీకాల శిబిరం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

మండలంలోని మల్కపూర్ మరియు పెద్దముద్దునూర్ గ్రామాల్లో పశువులకు ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమం నిర్వహించారు. మండల పశువైద్య అధికారి డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 154 పశువులకు, 215 గేదెలకు టీకాలు వేశారు. మల్కపూర్ సర్పంచ్ చేనమోని రాముడు, పెద్దముద్దునూర్ సర్పంచ్ ఎస్. ఊర్మిళమ్మ, ఉప సర్పంచ్‌తో పాటు పశువైద్య సిబ్బంది మాధ్య, వినయ్, శ్రీశైలం, సతీష్, మక్బూల్, పుల్లయ్య, పర్వతాలు, లింగస్వామి పాల్గొన్నారు.

### ఆల్విన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, కూకట్‌పల్లి :**

మూసాపేట్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు సభ్యులు ఆల్విన్ కాలనీ డిప్యూటీ కమిషనర్ ని కలిసి ఎల్లమ్మ బండ పరిధిలోని సమస్యలపై ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో గంజాయి ముఠాలకు అది అడ్డాగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, 24 గంటల వాచ్‌మెన్‌ను నియమించాలని విన్నవించారు. కార్యక్రమంలో బుల్లెట్ రవి ప్రభాకర్, రాకేష్, ధనరాజ్ తదితరులు పాల్గొని అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

### వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలి

**ముద్ర కూకట్‌పల్లి:**

రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కెపిహెచ్‌బి కాలనీ, వసంత నగర్ పరిసర ప్రాంతాల్లోని అన్ని ఫేజ్‌లకు తాగునీటి సరఫరా సక్రమంగా అందించాలని కోరుతూ కెపిహెచ్‌బి సర్కిల్ వాటర్ వర్క్స్ డిజిఎం త్రినాథ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాబోయే ఎండల తీవ్రతను బట్టి ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

### అభినందన

**ముద్ర కూకట్‌పల్లి:**

వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్యానెల్ సభ్యులనుగ కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు అభినందించారు.

### యాదవ జేఏసీ కమిటీ ఏర్పాటు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్‌లో తెలంగాణ యాదవ జేఏసీ నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా సుద్దుల సుధాకర్ యాదవ్, అధ్యక్షుడిగా బత్తుల బచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షులుగా నక్క మల్లేష్ యాదవ్, బర్ల వెంకటస్వామి యాదవ్, దాసరి నిరంజన్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వసంతం దేవరాజు యాదవ్‌ను నియమించారు. కార్యదర్శులుగా గడ్డమీది బుచ్చన్న యాదవ్, బద్దుల రామచంద్రుడు యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బత్తుల బాలరాజు యాదవ్, ప్రచార కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్ యాదవ్, కోశాధికారిగా బత్తుల మధు యాదవ్‌లను ఎంపిక చేశారు.

### శ్రమదానం

**ముద్ర ప్రతినిధి నగర్ కర్నూల్:**

షాహిద్ దివాస్ సందర్భంగా కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం, మై భారత్ ఆధ్వర్యంలో బస్టాండ్ అవరణలో ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు సేకరించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ ఆంజనేయులు, బీజేపీ కౌన్సిలర్ బోడ నర్సింహ, బీసీ సబ్ ప్లాన్ తాలూక అధ్యక్షుడు మ్యాకల రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్,సభ్యులు లక్ష్మి నరసింహ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బంగారం - వెండి**

ఫిజికల్ గోల్డ్ కంటే డిజిటల్ గోల్డ్/ ETFలు పరిశీలించండి భద్రత, పారదర్శకత ఎక్కువగా ఉంటుంది.




# ఓడినా తగ్గని 'పెత్తనం'

**- కరీంనగర్‌లో 'కంటెస్టెడ్' నేతల కొత్త డ్రామా!**

**- గెలవకపోయినా గెలిచినట్టే హంగామా.. కొత్త రాజకీయ ట్రెండ్**

**- 'కంటెస్టెడ్' హోదాలతో పెత్తనం.. స్థానిక పాలనలో గందరగోళం**

**- ఫ్లెక్సీలు, స్టిక్కర్లతో ఫేక్ పవర్ ప్లే.. అధికారులకు తలనొప్పి**

**- ఓడిన నేతల కొత్త స్ట్రాటజీ.. చట్టపరమైన చర్యల డిమాండ్**




**ముద్ర, కరీంనగర్:**

రాజకీయాల్లో గెలిచిన నేతలకే పదవి, పలుకుబడి, గౌరవం ఉంటాయి. పనులు చేయించేది, ప్రజల తరపున సమావేశాల్లో ప్రశ్నించేది కూడా పదవిలో ఉన్నవారే. మెజారిటీ సీట్లు గెలిస్తే అధికారపక్షం అంటారు.. తక్కువ సీట్లు వస్తే ప్రతిపక్షంలో కూర్చుంటారు. ప్రజాస్వామ్యంలో ఇది కామన్. కానీ కరీంనగర్‌లో ఎన్నికల్లో ఓడిన నేతలు కూడా పెత్తనం చెలాయించే వ్యూహం రూపొదిస్తున్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులతో సమానంగా 'కంటెస్టెడ్ ఎమ్మెల్యే', 'కంటెస్టెడ్ కార్పొరేటర్' గా స్వయంగా ప్రకటించుకుంటున్నారు. ఈ మేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాహనాలకు స్టిక్కర్లు పెట్టుకుంటున్నారు. విజిటింగ్ కార్డులు ఇస్తున్నారు. ఈ వింత పరిణామం స్థానిక పాలనలో గందరగోళాన్ని సృష్టిస్తుంది.

**పీఠం దక్కించుకున్న బీజేపీ..**

కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 డివిజన్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కార్పొరేటర్ స్థానాలు గెలిచి పీఠం దక్కించుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ జరిగింది. అధికార కాంగ్రెస్ పీఠం కోసం సర్వశక్తులు ఒడ్డినా ప్రజలు కమలం వైపే మొగ్గు చూపారు. ఫలితాల తర్వాత కూడా బీఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థులను కలుపుకుని పీఠం కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రయత్నాలు చేశారు. కానీ బీఆర్ఎస్ హ్యాండ్ ఇవ్వడంతో కాంగ్రెస్ ఆశలు ఆవిరయ్యాయ. ఇక ఓడిపోయిన నాయకులు పార్టీలోని నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'కంటెస్టెడ్' పేరుతో సొంతంగా లేని పదవులు సృష్టించుకుని అధికారం చెలాయించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఇది కొత్త ట్రెండ్‌గా మారింది.

**హోర్డింగ్‌లు, వాహనాలకు స్టిక్కర్లు..**

ఈ మేరకు పెద్ద ఫ్లెక్సీలపై 'కంటెస్టెడ్ ఎమ్మెల్యే/కార్పొరేటర్' అని పేరుపెట్టి రోడ్లపై ఏర్పాటు చేసుకుంటున్నారు. మానకొండూరు, కరీంనగర్ కార్పొరేషన్ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొందరు కార్లపై స్టికర్లు అంటించుకుని అధికారిక స్థాయిలో తిరుగుతున్నారు. మరికొందరు కలెక్టర్లు, ఎమ్మెల్యేల కార్యాలయాల్లో విజిటింగ్ కార్డులతో హాజరవుతున్నారు. స్థానిక సమస్యల సమావేశాల్లో ప్రధాన అతిథులుగా పాల్గొంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓడిపోయిన అభ్యర్థులు ఎక్కువగా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు.

**అధికార దుర్వినియోగమే..**

కంటెస్టెడ్ ట్రెండ్‌ను గెలిచిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికార దుర్వినియోగంగా పేర్కొంటున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తూ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పార్టీ స్థాయిలో డిసిప్లినరీ చర్యలు, పబ్లిక్ హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రజల్లో గందరగోళం పెరిగి, నిజ అధికారులను గుర్తించడం కష్టమవుతోంది.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



**బోథ్, ముద్ర:** ప్రజావాణి పోర్టల్ లో నమోదైన ఫిర్యాదులను త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధిహామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 93 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లోపు పరిష్కరించాలని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఇతర అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, యాక్షన్ టేకెన్ రిపోర్టులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పదేపదే ఒకే సమస్యపై ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. అప్పీల్ కేసులను రెండు ,మూడు రోజుల్లోనే పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు అందించే భోజన నాణ్యత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. కొత్త మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ సకాలంలో అందించాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, డీఆర్ డీవో రవీందర్, డీవైఎస్ఓ శ్రీనివాస్, డీఎండబ్ల్యూఓ కలీం, డీపీఓ రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఫౌండేషన్ అధ్యక్షుడు అర్ఫాత్ ఖాన్, ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గాలి కుంటుపై అవగాహన పెంచుకోవాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి పై రైతులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. ఈ వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ప్రచార వాహనాన్ని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించేలా ఈ ప్రచార రథం ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా రైతులు విధిగా తమ పశువులకు టీకాలను వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, పశువైద్య అధికారి బాలిగ్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంచార్జి హెచ్‌ఎంపై పోక్సో కేసు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ లో ఇంచార్జి ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న జి.విజయ భాస్కర్ పై నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసు నమోదు చేశారు. పది రోజుల క్రితం నిధుల దుర్వినియోగం, విధుల్లో నిర్లక్ష్యం అభియోగాలపై సస్పెండ్ చేశారు. అయితే పాఠశాల విదార్థినుల తల్లిదండ్రుల ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టారు. ఆరోపణలు ఋజువు కావటంతో ఆయనపై పోక్సో కేసు నమోదు చేశారు.

## భగత్ సింగ్ కు ఘనంగా నివాళులు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ లో సోమవారం పీడీఎస్ యూ ఆధ్వర్యంలో భగత్ సింగ్ కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేష్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ పోరాడి యుక్త వయస్సులోనే వారి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయ కులు రాజ్, నరేష్, వెంకటేష్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 55 దరఖాస్తులు

**మహాదేవపూర్, ముద్ర:** ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 55 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన మాట్లాడారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, వాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న కార్యక్రమం వరకు పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



**బోథ్, ముద్ర:**

తన నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎమ్మెల్యే హైదరాబాద్ లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోనీ ప్రధాన రోడ్లను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బోథ్ పట్టణంలో బీటీ రోడ్డు, సీసీ రింగ్ రోడ్డు, లైటింగ్ నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేయాలని కోరారు. పోచ్చర ఎక్స్ రోడ్డు నుంచి బోథ్ టౌన్ వరకు ఫోర్ లైన్ తో పాటు సెంట్రల్ లైటింగ్, మైనర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 38 కోట్లు, ఇచ్చొడ మండల కేంద్రంలో ఫోర్ లైన్ నిర్మాణంలో భాగంగా సైడ్ డ్రైన్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేయాలని కోరారు. తక్షణమే నిధులు మంజూరు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## బీడీ కార్మికులకు 'చేయూత' అమలు చేయాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయూత పథకం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. బక్కన్న, రామలక్ష్మణ్, గంగన్న, లక్ష్మి, ఎస్. లక్ష్మి, ఫెరోజ్, గంగాధర్, గంగామణి, నారాయణ, సుశీల, గోదావరి పాల్గొన్నారు.

# యుద్ధాలు, దాడులు ఆపాలి..

**- సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి**




**ముద్ర, కరీంనగర్:**

ప్రపంచ వ్యాప్తంగా ఒక దేశంపై మరో దేశం యుద్ధాలు, దాడులు చేయకుండా అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాలని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి హితవు పలికారు. సోమవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జిల్లా కార్యవర్గ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు జరుపుతున్న బాంబుల దాడులు రోజు రోజుకు తీవ్రతరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసం తక్షణమే ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకోవాలని కోరారు. యుద్ధం వల్ల అంతర్జాతీయ స్థాయిలో చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతుందని తెలిపారు. వంట గ్యాస్ ను బ్లాక్ మార్కెట్ కు తరలించి కొరత సృష్టించడంతో సామాన్య ప్రజలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేం ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా బాంబుల దాడుల నియంత్రణకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో సంప్రదింపులు చరపాలని సూచించారు. పార్లమెంటు సమావేశాల్లో అత్యధిక రోజులు పాల్గొన్నానని గొప్పలు చెప్పుకునే ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాల గురించి ఏం చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. మోదీ దేశంలో నిరుద్యోగం రూపుమాపలేదని, నల్లధనం వెలికి తీయలేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ హయంలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. కార్పోరేట్ సంస్థలు బాగుపడ్డాయన్నారు. ఆదానీ, అంబానీల ఆస్తులు పెరిగాయన్నారు. పేదల బ్రతులు మారలేదని ఆరోపించారు. తమ పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుని దేశ రాజకీయాలలో క్రీయశీల పాత్ర పోషిస్తున్న సందర్భంగా ప్రజలకు మరింత చేరువ కావడం కోసం ఏప్రిల్ లో ఇంటింటికి సీపీఐ అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ సభ్యత్వాన్ని పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు తో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# 'సూర్యఘర్'ను వినియోగించుకోవాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**మహాదేవపూర్, ముద్ర:**

జిల్లాలో పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచుతూ విద్యుత్ ఖర్చులను తగ్గించుకునేందుకు ప్రతి కుటుంబం ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో రెడ్కో, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రచార రథాన్ని, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గృహాలపై సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు అర్హులైన గృహ వినియోగదారులు అధికారిక వెబ్‌సైట్ www.pmsuryaghar.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, రెడ్కో డీఎం మహేందర్ రెడ్డి, ఆర్డీఓ హరి కృష్ణ, విద్యుత్తు శాఖ టెక్నికల్ డీఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

**గాలికుంటుపై అప్రమత్తంగా ఉండాలి**

జిల్లాలోని పశుపోషకులు గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ ప్రచార రథాన్ని, కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు ఒక అంటు వ్యాధి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ డా. కుమార స్వామి, ఏడీ డా. గోపాలకృష్ణ, పశు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 24-03-2026
www.mudranews.in | @mudranews



బంగారం-వెండి
హాల్‌మార్క్ తప్పనిసరి
బంగారం,
వెండి
కొనేటప్పుడు
BIS
హాల్‌మార్క్
ఉన్నదే కొనండి.


## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**
**- ప్రజావాణిలో 52 అర్జీల స్వీకరణ**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల 52 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 39, డివిజనల్ పంచాయతీ 5, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై, జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఎంప్లాయిమెంట్, సివిల్ కోర్టు, లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా మార్కెటింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్ వన్, ఈ ఈ పంచాయతీ రాజ్ శాఖలకు ఒక్కొక్కిక చొప్పున వచ్చాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభ రాణి, జిల్లా నాగిరెడ్డి, జిల్లా పం చాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలి

**- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:
ప్రభుత్వం అంగన్వాడీలకు బడ్జెట్ కేటాయించి కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బూరుగు సప్న, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి గ్రామాలలో, పట్టణాల్లో అంగన్వాడీ టీచర్లుగా పిల్లలకు, గర్భిణీలకు విద్యాబుద్ధులు పౌష్టికాహారం సకాలంలో అందిస్తూ దేశ అభివృద్ధికి ఉపయోగపడుతూ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ టీచర్ల పట్ల ఆయాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మిక చట్టాలైన ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, రిటైర్మెంట్ అయిన ఆయాలకు, టీచర్లకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని, వేసవి సెలవులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు రమాకుమారి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.




## ఆలయాల్లో శ్రీరామనవమి ఏర్పాట్లు చేయాలి

**- చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

రాబోవు శ్రీరామనవమి పండుగ పురస్కరించుకొని పట్టణంలోని దేవాలయాల్లో ఏర్పాట్లు చేయాలని చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని వివిధ దేవాలయాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ అన్ని దేవాలయాల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు, ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డుల కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- కౌన్సిలర్ గుర్రాల సంతోష శ్రీనివాస్**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 13వ కౌన్సిలర్ గుర్రాల సంతోష శ్రీనివాస్ అన్నారు. సోమవారం వార్డులో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్‌తో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ మజర్ పాషా, నరేష్, సభర్ కార్ వెంకటేష్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పని ప్రదేశాలను పరిశీలించిన ఏపీడీ విజయ భాస్కర రెడ్డి

ముద్ర, ఖమ్మం:
జిల్లాలోని జూలూరుపాడు మండల పరిధిలో పని ప్రదేశాలు, సిఎస్పి నిర్మాణాన్ని కొత్తగూడెం ఏపీడీ విజయ భాస్కర రెడ్డి సోమవారం పరిశీలించారు. మండలంలోని మాచినేనిపేట తండా గ్రామస్తులు జూలూరుపాడు ఎర్ర చెరువులో చేస్తున్న పూడికతీత పనిని, మస్టర్లను పరిశీలించి, మార్కింగ్, కూలీలకు వస్తున్న వేతనాలను, పని ప్రదేశాల వద్ద కూలీలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం పని ప్రదేశం వద్ద భోజనాలు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశం వద్ద భోజనాలు కల్పించడం మంచి పద్ధతిగా కొనియాడారు.
అనంతరం పడమటి నర్సాపురం గ్రామ పంచాయతీ పరిధిలో సేవాలాల్ గుట్టపై జరుగుతున్న స్టాగ్గెర్డ్ ట్రెంచ్స్ పనిని, మస్టర్లను పరిశీలించి డిమాండ్ పెట్టి పనికి రాని కూలీలందరూ పనికి హాజరు కావాలని, ప్రతి 2 రోజులకు ఒకసారి పంచాయతీ కార్యదర్శి పని ప్రదేశాన్ని, మస్టర్లను పరిశీలించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నుంచి అందాల్సిన కూలీల చెల్లింపులు త్వరలోనే ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే వారి అకౌంట్ నెంబర్లకు జమవుతాయని తెలిపారు. అనంతరం సీఎస్పీ ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తదనంతరం ఉపాధి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఏపీఓ రామారావు, ఈసీ సైదులు, పంచాయతీ కార్యదర్శులు ఖాదర్ వలీ, హారిక, ఎఫ్ఏ లు రమేష్, రవి, మెట్లు, పడమటి నర్సాపురం సర్పంచ్ సంగం లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.



### జిల్లా గ్రంథాలయంలో

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**- జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎండి అవైస్ రహమాన్ చిస్తి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:
జిల్లా గ్రంథాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలోభాగంగా సోమవారం నుండి 29వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవైస్ రహమాన్ చిస్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్న వివిధ రకాల పుస్తకాలు, కాంపిటేషన్ పుస్తకాలు, వివిధ రకాల తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ సంబంధించిన పుస్తకాలను చూసి పరిశీలించారు. పాఠకులకు కావలసిన కాంపిటేషన్ పుస్తకాలను ఆన్ డిమాండ్ ద్వారా ప్రతినెల వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కాంపిటీషన్ పుస్తకాలను తెప్పించుటకు కృషి చేస్తానని అన్నారు. గ్రంథాలయం లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది జంపయ్య, రుకోధర్, శ్రీను, కావ్య, పాఠకులు పాల్గొన్నారు.





## 25న జరిగే ధర్నాకు మద్దతు తెలుపండి

ముద్ర, ఖమ్మం:
చేనేత పరిశ్రమ చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 2026 మార్చి 25న జరిగే ధర్నాకు మద్దతు తెలుపాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావుకు వనం శాంతి కుమార్, ముషం నరహరి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నాకు విచ్చేసి మద్దతు తెలిపి సందేశం ఇవ్వాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

### శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం

# చైర్మన్ గా పైళ్ల దామోదర్ రెడ్డి



ముద్ర, ఆత్మకూర్(ఎం):
శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థాన పాలకమండలి ఎన్నిక సోమవారం మాజీ చైర్మన్ గుండేగాని అయిలయ్య అధ్యక్షతన జరిగింది. దేవస్థానంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గా పైళ్ల దామోదర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, పాలకమండలి సభ్యులుగా తవిటి వెంకటేశ్వర్లు, సూరారం రాము, గడ్డం హరీష్, ఎలిమినేటి ఎలేందర్, మజ్జిగ రాంబాబు, గంగారపు రాజు, ఎలగందుల శ్రీను, బండారి సాయి, ఇంజమూరి నర్సింహా, ఎలిమినేటి దామోదర్ రెడ్డి, రాచమల్ల సత్తయ్య, కందడి వెంకట్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గత పాలక మండలి, నూతన పాలకమండలికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, మాజీ సర్పంచ్ లు బీసు చందర్ గౌడ్, జన్నాయి కోడె నగేష్, అఖిల పక్ష నాయకులు యాస లక్ష్మారెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, యాస ఇంద్రా రెడ్డి, గజరాజు కాశీనాథ్, దిగోజు నర్సింహా చారి, కోరే భిక్షపతి, యాస బుచ్చి రెడ్డి, రచ్చ గోవర్ధన్, పోతగాని మల్లేశం గౌడ్, మజ్జిగ నర్సయ్య, సుల్తాన్ పురుషోత్తం, లోడి వెంకటయ్య, ఎద్దు వెంకటేశ్వర్లు, బండారు సత్యనారాయణ, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ టీచర్ల ధర్నా..

ముద్ర, మహబూబాబాద్:
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ టీచర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ యూనియన్ నాయకురాలు సులోచన, కాటరోజా, స్నేహ బిందు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలు నెరవేర్చాలని కోరారు. ధర్నాలో పాల్గొన్న జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతుందని, ఇంతవరకు అంగన్వాడీ టీచర్లకు న్యాయమైన సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లను ఆదుకోవాలని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తమ సమస్యలను పెట్టిన పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటరోజా, సులోచన, స్నేహ బిందు, పద్మ, పద్మ శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

**- మరొకరికి తీవ్ర గాయాలు**

ముద్ర, హనుమకొండ:
సిద్దిపేట – హనుమకొండ ప్రధాన రహదారిపై మంగళపల్లి స్టేజి వద్ద సోమవారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరె కిరణ్(35) అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు అంబాల రాజుకు తీవ్ర గాయాలయ్యాయి.
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామానికి చెందిన అంబాల రాజు వేకువజామునే ఆయన స్వగ్రామం వంగర నుంచి హుస్నాబాద్ కు బైక్ పై వెళ్తుండగా మంగళపల్లి స్టేజి వద్ద కదిరె కిరణ్ అతన్ని లిఫ్ట్ అడిగాడు. దీంతో బైక్ పై కిరణ్ కూర్చుంటున్న క్రమంలో వెనుక నుండి అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందగా రాజుకు తీవ్ర గాయాలయ్యాయి.



స్థానికుల సమాచారంతో 108 లో రాజును వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.
ఇష్టానుసారంగా టిప్పర్ లారీలు నడుస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సిద్దిపేట–హనుమకొండ ప్రధాన రహదారిపై మంగళపల్లి గ్రామస్తులు ధర్నా చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని టిప్పర్, లారీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి పరిహారం కల్పించి, రోడ్డు ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్, సదరు కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వంగర ఎస్సై దివ్య గ్రామస్తులకు సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

# తాలిపేరు ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల బృందం

ముద్ర, ఖమ్మం:
చర్ల మండలంలోని తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టును నిపుణుల బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు రక్షణ చర్యలపై నిపుణుల బృందం అధికారులకు పలు సూచనలు చేసింది. ప్రాజెక్టు స్థిరీకరణ ఆయకట్టు, క్యాచింగ్ ఏరియా, హైయెస్ట్ ఇన్‌ఫ్లో ఇతరత్రా వివరాలను జల వనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు సమగ్ర ఆనకట్ట భద్రత మూల్యాంకన నివేదిక తయారీ నిమిత్తం తాలిపేరు ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టులో చేపట్టాల్సిన అత్యవసర పనులపై ఇంజినీరింగ్ అధికారులకు బృంద సభ్యులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఎస్ఈ ఏవీవీఎల్ నరసింహారావు, ఈఈ ఎస్ఏ జానీ, డీఈ తిరుపతి, ఏఈ లు సంపత్, సుమన, రవి తేజ పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బంగారం- వెండి : పాత బంగారం అమ్మే ముందు ధరలు పోల్చండి
ఒకే దుకాణానికి కాకుండా 2-3 చోట్ల రేట్లు తెలుసుకోండి.




## సిద్దిపేటకు రూ.1070 కోట్ల నిధులు విడుదల చేయాలి

- సీఎంపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నిలిపివేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు ఆరోపించారు. సిద్దిపేటపై నిజమైన ప్రేమ ఉంటే గతంలో మంజూరైన రూ.1070 కోట్ల పనులను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎప్పుడూ కొడంగల్‌పైనే దృష్టి సారిస్తున్న సీఎం, మొత్తం తెలంగాణకు ముఖ్యమంత్రిగా వ్యవహరించాలన్నారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు గుండు భూపేష్, కురా మాణిక్య రెడ్డి, జాప శ్రీకాంత్ రెడ్డి, సారయ్య, ఎల్లారెడ్డి, లింగం గౌడ్, సోమోరెడ్డి చిన్నా తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సిద్దిపేటకు వచ్చి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. 300 ఎకరాలు, 62 ఎకరాల మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. కలెక్టరేట్ పక్కన వెటర్నరీ కాలేజీ కోసం వేసిన పిల్లర్లు సీఎం రాకను ఎద్దేవా చేస్తున్నాయని అన్నారు. గతంలో సిద్దిపేట అభివృద్ధి కోసం మంజూరైన పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసి, వాటిని కొడంగల్‌కు మళ్లించడంపై తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. నర్మెట్ట ఆయిల్ ఫామ్ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసత్యాలని ఆరోపించిన రాధాకృష్ణ శర్మ, ఆ వ్యాఖ్యలపై అంబేద్కర్ సర్కిల్ వద్ద చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి తన స్థాయికి తగ్గట్లుగా వ్యవహరించాలని, రాజకీయ ఆరోపణలను మానుకోవాలని సూచించారు.ఇప్పటికైనా సిద్దిపేట అభివృద్ధికి సహకరించి, నిలిపివేసిన రూ.1070 కోట్ల నిధులను విడుదల చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ లాల్, పూజల వెంకటేశ్వర్ రావు, ఆంజనేయులు, రెడ్డి ప్రభాకర్, మెరుగు మహేష్, అజీజ్, రాజేందర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## సహజ ప్రసవాలు పెంచండి : కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



మాత శిశు ఆరోగ్య కేంద్రం లో సహజ ప్రసవాలు సంఖ్యను పెంచుతూ గర్భవతులకు మెరుగైన సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని కలెక్టర్ కె హైమావతి ఆదేశించారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి గర్భిణీ స్త్రీలకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేద గర్భిణీలకు మంచి వైద్యం అందించడం కోసం ఆసుపత్రి భవనంతో పాటు అన్నిరకాల సదుపాయాలను కల్పించిందన్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనీ డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది ప్రతి ఒక్కరు గర్భిణీలకు ఓపికగా వైద్యం చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి లోపల అన్ని వార్డులు కలియ తిరిగారు. అప్పుడే పుట్టిన పిల్లలకు టీకా లను సక్రమంగా అందించాలని వార్డులలో గర్భిణీ, పుట్టిన బిడ్డలకు మంచి వైద్యం అందించాలని ఆదేశించారు. గర్భిణీలలో మనోధైర్యం నింపుతూ మంచి ఆహారపు నియమాలు, సహజ ప్రసవాలు జరిగేలా యోగా లాంటి కొన్ని యాక్టివిటీస్ తెలుపాలని డాక్టర్లలకు సూచించారు. సహజ ప్రసవాలు పెంచాలని తప్పనిసరి పరిస్థితిలో మాత్రమే ఆపరేషన్ చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో కొంత మంది డాక్టర్లు ఇతర సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు నా దృష్టికి వచ్చిందని వారి పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ డాక్టర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు పై అధికారి అనుమతి లేనిదే సెలవు తీసుకోవద్దని తప్పనిసరిగా ఆసుపత్రిలో లీవ్ లెటర్ పెట్టాలని తెలిపారు.

## క్యాన్సర్ తో వివాహిత యువతి

- కాపాడేందుకు రక్తదానం చేసిన గ్రామస్థులు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వివాహిత యువతి ప్రాణాలు కాపాడేందుకు గ్రామం అంత ఏకమై రక్త దానం చేశారు. మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ మండలం భూరుగుపల్లి గ్రామనికి చెందిన శెవ్వ శరత్ బాబు కూతురు కీర్తనను కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పరమళ్ళ గ్రామానికి చెందిన ఈర్ల సంగమేశ్వర్ కు నాలుగు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. గత నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా కీర్తనకు క్యాన్సర్ ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. గత 28 రోజులుగా హైదరాబాద్ లోని ఎంఎన్జే కాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. రక్తం అవసరం ఉండటంతో గతంలో అత్తగారి గ్రామం పరమళ్ళలో 100 మంది రక్త దానం చేయగా, ఇంకా అవసరం ఉందని వైద్యులు సూచించడంతో సోమవారం తల్లిగారి గ్రామం భూరుగుపల్లిలో మైత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 60 మంది నుండి రక్తం సేకరించినట్లు సర్పంచ్ సాయిలు తెలిపారు.

## డబ్బుల కోసం మెమోలు ఇవ్వని డిగ్రీ కళాశాల

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విద్యార్థులు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



30 వేలు చెల్లిస్తేనే డిగ్రీ, ఇంటర్, టెన్త్ మెమోలు ఇస్తామని చేగుంట శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మెదక్ లో అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చేగుంటలోని సాధన డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశ సమయంలో ప్రభుత్వం ఇచ్చే స్కాలర్షిప్ మాత్రమే తీసుకుంటామని, ఎలాంటి ఫీజులు విద్యార్థుల నుండి వసూలు చేయమని చెప్పారు. డిగ్రీ పూర్తయింది. డిగ్రీతోపాటు ఇంటర్, టెన్త్ మెమోలు ఇవ్వాలని కోరగా స్కాలర్ షిప్ మంజూరు కాలేదు. ప్రతి విద్యార్థి 30 వేల రూపాయలు చెల్లించి మెమోలు తీసుకెళ్లాలని సూచించినట్లు విద్యార్థులు అదనపు కలెక్టర్ నగేష్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. 11మంది విద్యార్థులు కలెక్టరేట్ కు వచ్చారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు ఉన్నతాధికారులు స్పందించి తమ ఒరిజినల్ మెమోలు ఇప్పించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు సన్నాహాలు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, పౌర సరఫరా, అటవీ, మహిళాశిశు సంక్షేమ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు సూచనలు చేశారు. ఏప్రిల్ 15 నుంచి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. యాసంగి (రబీ) సీజన్‌లో 4,45,466 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కల సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సంవత్సరం జిల్లాకు కేటాయించిన 31.7 లక్షల మొక్కల నాటకం లక్ష్యాన్ని సాధించేందుకు పటిష్ఠ కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. జూలై మొదటి వారంలో ప్రారంభమయ్యే కార్యక్రమానికి గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కల వివరాలు సేకరించాలని చెప్పారు. 2027, 2028 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. బాల్యవివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తక్కువ బరువు, ఎత్తు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### పరీక్షా కేంద్రాల తనిఖీ

జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, పర్యవేక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

### ప్రజావాణిలో వినతుల స్వీకరణ

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేసిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. ఐడీఓసీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు

- ఆరోగ్య సేవల్లో కీలక ముందడుగు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది.సోమవారం నుండి సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రెండు ఏరియా ఆసుపత్రులు, మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య ఇందిరానగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి,డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియ, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు.రోగుల ఆరోగ్య చరిత్రను డిజిటల్ రూపంలో భద్రపరచడం ద్వారా వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించ వచ్చని ఆమె తెలిపారు. నెట్‌వర్క్,టెక్నికల్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ప్రగతిని సమీక్షిస్తూ, సమర్థవంతంగా అమలు చేపట్టాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ద్వారా రోగుల ఆరోగ్య చరిత్ర, పరీక్షల వివరాలు,చికిత్స సమాచారం అన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతో దోహద పడుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత్ రావు,డాక్టర్ శశాంక్, మెడికల్ ఆఫీసర్లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి లో అందిన ప్రతి దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిగణించి సంబంధిత శాఖ అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు వినిపించే ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల శ్రీ సాయి కృష్ణ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం,హాల్ ఏర్పాట్లు,విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సీసీ కెమెరాల ఏర్పాటు,భద్రతా చర్యలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షలు సజావుగా,పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. .పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్ లు పరీక్షా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేని వ్యక్తులను, ముఖ్యంగా మొబైల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని కలెక్టర్ సూచించారు.



## వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు

- కలెక్టర్ ప్రావీణ్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జిల్లాలో రైతుల ఆదాయం పెంపుతో పాటు వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు ఫార్మ్ మెకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి (ఆర్ఏడీ), తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చే యాలనా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు సూచనలు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించి, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీలు) వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించి, రైతులను యాంత్రీకరణ వైపు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ స్ప్రేయర్లు వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 97 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తేనెటీగల పెంపకం (బీ కీపింగ్) కార్యక్రమాన్ని విస్తరించి, ఎక్కువమంది రైతులకు బీహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు వేగవంతంగా పూర్తి చేయాలి..

అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు,సంగారెడ్డి, నారాయణఖేడ్ స్టేడియంలలో కొనసాగుతున్న మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్,యువజన సంక్షేమ & క్రీడాభివృద్ధి, విద్యాశాఖ, శిశు సంక్షేమ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం,నారాయణఖేడ్ స్పోర్ట్స్ స్టేడియం రిపేరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీడబ్ల్యూఓ లలిత కుమారి, సీపీఓ బాలశౌరి,స్పోర్ట్స్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి,అదనపు డీఆర్‌డీఓ బాలరాజ్,డీఈఓ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయాలు కొనసాగిస్తాం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా మెదక్ కేవల్ కిషన్ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిపీఎం జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం మాట్లాడుతూ... భగత్ సింగ్ బ్రిటీషు పాలనలో స్వరాజ్య స్థాపన కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి 23 సంవత్సరాల వయస్సులోనే ఉరి తీయబడిన మహా నాయకుడని కొనియాడారు. సిపీఎం పార్టీగా జిల్లాలో భగత్ సింగ్ ఆశయ సాధనలో భాగంగా పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి సమాజ మార్పు కోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జె. సంతోష్ కుమార్, సిహెచ్. అజయ్ కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### అమరవీరుల త్యాగాలకు నివాళి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :** తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో ఎన్ఎస్ఎస్ విభాగాలు ,జువాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అమరవీరుల దినోత్సవం (షహీద్ దివస్) ఘనంగా నిర్వహించబడినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ,భగత్ సింగ్, రాజ్‌గురు,సుఖ్‌దేవ్ వంటి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుల ధైర్యసాహసాలను, త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం మార్చి 23న దేశవ్యాప్తంగా షహీద్ దివస్‌ను నిర్వహిస్తామని తెలిపారు. .ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ సిహెచ్ జోస్నా, అధ్యాపకులు మిథున్ కుమార్ రాథోడ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల జేఏసీ నిరసనను జయప్రదం చేయండి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జేఏసీ కన్వీనర్ జోగు బిక్షపతి మాట్లాడుతూ, పెన్షనర్లను జనవరి 2026కు ముందు రిటైర్ అయిన వారు, ఆ తరువాత రిటైర్ అయిన వారిగా రెండు వర్గాలుగా విభజించి, వారికి వర్తించాల్సిన పిఆర్సీ, డిఆర్ వంటి ప్రయోజనాల్లో వివక్ష చూపించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మార్చి 25, 2025న పార్లమెంట్‌లో వ్యాలిడేషన్ చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపజేసిందని విమర్శించారు. 25 బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు జిల్లా నర్సింలు, బోరెడ్డి మధుసూదన్ రెడ్డి, అన్నమరెడ్డి, పోలీసు రాజులు, వీరారెడ్డి, శ్రీరామ్, ఆంజనేయులు, విశ్వనాథం, నారాయణరెడ్డి, బన్సీలాల్, భగవాన్ రెడ్డి, నాగేందర్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కొండయ్య, పరుశరాములు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**బంగారం– వెండి : మేకింగ్ ఛార్జీలు జాగ్రత్తగా చూడండి**

యుద్ధ సమయంలో జ్యువెలర్స్ ఎక్కువ ఛార్జీలు వేయొచ్చు.





## బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో హోరాహోరీ..

- **బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణమన్న హరీష్ రావు**
- **బియ్యం ఎగుమతులతో తప్పిన రూ. 13 కోట్ల భారం**
- **హౌస్ కమిటీ వేస్తే గత ప్రభుత్వ ఒప్పందాలను పరిశీలించాలి**
- **శాసనసభలో హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కౌంటర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రేషన్ బియ్యం ఎగుమతుల వ్యవహారం అసెంబ్లీలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఒకవైపు భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేయగా, మరోవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాటిని ఖండిస్తూ ప్రభుత్వ చర్యలను సమర్థించారు. హరీశ్ రావు మాట్లాడుతూ బియ్యం ఎగుమతుల చుట్టూ వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడైన వ్యక్తిని అడ్వైజర్‌గా ఎలా నియమించారని ప్రశ్నిస్తూ, ఈ వ్యవహారంపై తక్షణమే హౌజ్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫిలిప్పీన్స్‌కు లక్షల టన్నుల బియ్యం ఎగుమతి చేస్తామని చెప్పి, చివరకు కేవలం 22,750 మెట్రిక్ టన్నుల వద్ద ఆగిపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. కాకినాడ పోర్టులో వేల టన్నుల బియ్యం నిల్వ ఉండటం కూడా ప్రశ్నార్థకమని విమర్శించారు.

దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. హరీశ్ రావు ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. వ్యక్తిగత అసహనంతోనే ఈలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు పూర్తిగా ప్రభుత్వాల మధ్య ఒప్పందం ప్రకారం జరిగాయని స్పష్టం చేశారు. అక్కడి రాజకీయ పరిస్థితుల వల్ల కొన్ని దిగుమతులపై ఆంక్షలు వచ్చినప్పటికీ, తెలంగాణ బియ్యానికి మినహాయింపు లభించిందన్నారు.

అంతేకాక, బియ్యం ఎగుమతుల వల్ల రాష్ట్రానికి రూ.13 కోట్ల భారం తగ్గిందని తెలిపారు. తెలంగాణ బియ్యానికి దేశంలోనే అత్యధికంగా క్వింటాకు రూ.3,600 ధర లభించిందని మంత్రి వెల్లడించారు. 22,750 మెట్రిక్ టన్నుల ఎగుమతితో రాష్ట్రం అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు పొందిందని తెలిపారు. థాయ్‌లాండ్, వియత్నాం, కంబోడియా దేశాల బ్రాండ్ల సరసన తెలంగాణ బియ్యం నిలిచిందని చెప్పారు. రైతుల ప్రయోజనాల కోసమే బియ్యాన్ని గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హౌజ్ కమిటీ వేస్తే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలనూ పరిశీలించాల్సిందేనని మంత్రి వ్యాఖ్యానించారు. ఇలా బియ్యం ఎగుమతుల అంశంపై అసెంబ్లీలో ఆరోపణలు-ప్రత్యారోపణలు వెల్లువెత్తడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.



## ఫీజు రీయింబర్స్ మెంట్ పై దద్దరిల్లిన అసెంబ్లీ

- **ప్లకార్డులతో బీఆర్ఎస్ సభ్యుల నిరసన**


**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

అసెంబ్లీ ప్రాంగణం బీఆర్ఎస్ సభ్యుల నిరసనలతో మార్మోగింది. రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో భారీ నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నట్టే, ఇప్పుడు విద్యార్థుల జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక వేల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం మరింత పటిష్టంగా కొనసాగించి విద్యార్థుల బంగారు బాటకు మార్గం చూపిందని గుర్తు చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలువురు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

## విద్యుత్ కార్మిక మృత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి రూ. కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందజేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో రూ. కోటి చొప్పున చెక్కులు అందజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, అజహరుద్దీన్ పాల్గొన్నారు.



# బాసర ట్రిపుల్ ఐటీలో ఏం జరుగుతోంది?



సమస్యల సాధన కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులు

- **నిరసనల మధ్య హఠాత్తుగా సెలవులు**
- **సమస్యల నుంచి తప్పించుకునే యత్నమా?**
- **విద్యార్థిని మృతి తర్వాత ఉద్రిక్తతలు**
- **అస్తవ్యస్త పరిస్థితులు.. చదువులపై ప్రభావం**
- **అడ్మిషన్లపై పడే ప్రమాదం**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు, విద్యార్థుల నిరసనలు, సిబ్బంది ఆందోళనలు, వెరసి సెలవులు ఇచ్చేలా పురికొల్పాయన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. నెల రోజులుగా బాసర ట్రిపుల్ ఐటీ లో అంతర్గతంగా అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయన్న విషయం గతంలోనే "ముద్ర" వెలికి తీసింది. ఈ క్రమంలో ఈ నెల 23 నుంచి సెలవులు ప్రకటించటం ఊహించని పరిణామంగా పేర్కొంటున్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం తగిన చర్యలు చేపట్టడం లేదన్నది కొన్నేళ్లుగా వెలుగు చూస్తున్న వాస్తవం. ఈ పరిస్థితుల్లో తరచూ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం, తమ సమస్యల సాధన కోసం నిరసనలు వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. దీనికి తోడు ఇటీవల సిబ్బంది కూడా తమ సమస్యల సాధనకు ఆందోళనలు చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కొద్ది రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్న తరుణంలో యాజమాన్యం వారితో చర్చలు కొనసాగించింది. ఈ చర్చల్లో సమస్యల పరిష్కారానికి వారం రోజుల గడువు కోరినట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇదే తరుణంలో విద్యార్థిని ఒకరు అనారోగ్యంతో మృతి చెందడంతో నిరసనలు ఊపందుకున్నాయి. ఒకపక్క సమస్యల పరిష్కారానికి గడువు సమీపించడం, మరో పక్క విద్యార్థిని మృతికి నిరసనగా ఉద్యమం చేపట్టడంతో యాజమాన్యానికి తల నెప్పి వ్యవహారంగా మారింది. ఈ క్రమంలో సమస్య తీవ్రతను తగ్గించేందుకు సెలవుల ప్రకటనే ఏకైక మార్గంగా భావించినట్లు తెలుస్తోంది. ఐతే ఈ సెలవుల ప్రకటన వల్ల విద్యార్థుల చదువుల పరిస్థితి ఏమవుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి ప్రకటన వెలువడింది. ఐతే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో అడ్మిషన్లపై ప్రభావం చూపే ప్రమాదం కూడా లేకపోలేదు.

### ఆవేశంతో ఆందోళనలు చేయొద్దు


- **మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష**



విద్యార్థులు ఆవేశంతో ఆందోళనలు చేయవద్దని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. బాసర ట్రిపుల్ ఐటీ లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నిరసనలు, తదనంతరం సెలవులు ప్రకటన, తదితర అంశాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం హైదరాబాద్ లోని తన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్యాంపస్‌లో ప్రస్తుత స్థితిగతులు, విద్యార్థుల ఆందోళనల వెనుక ఉన్న కారణాలను బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ మంత్రికి వివరించారు. క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా, ముందస్తు జాగ్రత్తగా సెలవులు ప్రకటించాల్సి వచ్చిందని వీసీ గోవర్ధన్ మంత్రికి తెలిపారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్లు, సెలవుల ప్రకటనకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, కేవలం ఆవేశంతో ఆందోళనలు చేస్తూ తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. క్యాంపస్‌లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన తేల్చి చెప్పారు. త్వరలోనే క్యాంపస్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని వీసీని మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యార్థులతో చర్చిస్తానని తెలిపారు.

# తెలంగాణ నుంచి తిరుపతి..

- **అందుబాటులోకి కొత్త హైవే**
- **అటవీ ప్రాంతం మీదుగా కొండలు, లోయల మధ్య ఆహ్లాదకర ప్రయాణం**
- **నేషనల్ హైవే 565 అందుబాటులోకి**
- **యర్రగొండపాలెం వద్ద పూర్తయిన పనులు**
- **తిరుపతి, తెలంగాణ మధ్య ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కీలకమైన నేషనల్ హైవే 565 పనులు పూర్తి చేశారు. ఈ హైవేపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ హైవే పనుల్లో భాగంగా.. యర్రగొండపాలెం దగ్గర 20 కిలో మీటర్ల రోడ్డును విస్తరించారు. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఊరట దక్కింది. ఈ 20 కిలో మీటర్లు అటవీ ప్రాంతం మీదుగా వెళుతోంది.. బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లతో ప్రయాణం సాఫీగా సాగుతోంది.

తెలుగు రాష్ట్రాల మధ్య నేషనల్ హైవే 565 అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలోని నకిరేకల్ వద్ద మొదలయ్యే ఈ హైవే.. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో ఉన్న ఏర్పేడు దగ్గర ముగుస్తుంది. ఈ కొత్త హైవే హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి 65ని.. మదనపల్లె నుంచి నాయుడుపేట వెళ్లే నేషనల్ హైవే 71తో కలుపుతుంది. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి తిరుపతి వెళ్లడానికి ఈ కొత్త హైవే ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడనుంది.

ఈ హైవే నల్గొండ, మాచర్ల, యర్రగొండపాలెం, మార్కాపురం, పొదిలి, కనిగిరి, పామూరు, దుత్తలూరు, రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా వెళ్తుతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్ రాత్రిళ్లు అటవీ ప్రాంతం మీదుగా వెళ్లడం గతంలో చాలా ఇబ్బందిగా ఉండేది. ముఖ్యంగా పుల్లల చెరువు దగ్గర నుంచి వెల్దుర్తి మండలం వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండేది. ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అయితే జాతీయ రహదారి 565 నిర్మాణంతో ఆ కష్టాలు తొలగిపోయాయి. ఈ రోడ్డు అభివృద్ధి చేయడంతో యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం సులభతరమైంది.

ఈ రూట్‌లో.. ఎన్‌హెచ్ 565లో భాగంగా ఉన్న ఈ 20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు గతంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా అటవీ అనుమతులు ఆలస్యం కావడంతోపాటు మరి కొన్ని అడ్డంకులు వచ్చాయి. అయితే 2024లో ఈ పనులకు లైన్ క్లియర్ కావడంతో.. గతేడాది పనులు ప్రారంభించి వేగవంతం చేశారు. ఈ రోడ్డును నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అటవీ ప్రాంతం మీదుగా కొండలు, లోయల మధ్య వెళ్లే ప్రయాణికులకు ఈ మార్గం సరికొత్త అనుభూతిని పంచుతోంది.

గతంలో రోడ్డు బాగోలేకపోవడంతో పుల్లల చెరువు నుంచి వెల్దుర్తి మండలం వరకు ప్రయాణానికి 50 నిమిషాలు పట్టేది. కానీ ఇప్పుడు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు. 20 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు నిర్మాణానికి రూ.393 కోట్లు ఖర్చు చేశారు. అటవీ ప్రాంతం, ఘాట్ రోడ్డు కావంతో చిన్న, పెద్దవి కలిపి మొత్తం 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లను ఏర్పాటు చేశారు.

మార్కాపురం జిల్లాతో కడప జిల్లాలోని పోరుమామిళ్ల ప్రాంతం నుంచి ఈ రోడ్డు మీదుగానే హైదరాబాద్ వెళ్లొచ్చు. ఈ హైవే మొత్తం పొడవు దాదాపు 420 కిలోమీటర్లు కాగా.. మెజార్టీ భాగం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. తెలంగాణలోని నకిరేకల్, నల్గొండ, కనగల్, దేవరకొండ ప్రాంతాలను దాటిన తర్వాత మాచర్ల వద్ద ఈ హైవే ఏపీలోకి ప్రవేశిస్తుంది. ఏర్పేడు వద్ద ఎడమ వైపు ప్రయాణిస్తే శ్రీకాళహస్తి, కుడి వైపు తిరిగే తిరుపతి వెళ్లొచ్చు.



## విచారణ అంటే అంత అలుసా...?

- **వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఉండదు**
- **రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు విచారణపై హైకోర్టు సీరియస్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బకాయిల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విచారణకు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాలని గతంలోనే ఆదేశించినప్పటికీ, ఆయన గైర్హాజరీపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఆ పనుల్లో నిమగ్నమై ఉండటంతోనే ఫైనాన్స్ సెక్రటరీ విచారణకు రాలేకపోయారని కోర్టుకు వివరించారు. ఈ కారణంతో ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, ఈ విన్నపాన్ని హైకోర్టు తోసిపుచ్చింది. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేయడంపై ధర్మాసనం నిప్పులు చెరిగింది. ‘రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదు. కోర్టు ఆదేశించినా అధికారి రాకపోవడం ఏంటి?’ అని ప్రశ్నించింది. తాము ఇవాళ అర్ధరాత్రి వరకు కోర్టు హాలులోనే ఉంటాం.. కానీ ఫైనాన్స్ సెక్రటరీ మాత్రం ఖచ్చితంగా విచారణకు హాజరుకావాల్సిందేనని కోర్టు పేర్కొంది. ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి ఎలాంటి మినహాయింపు ఇచ్చే ప్రసక్తే లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాలు కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. తమ జీవితకాలపు పొదుపు మొత్తాల కోసం వృద్ధాప్యంలో కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కోర్టు స్పందిస్తూ ఆర్థిక శాఖను వివరణ కోరింది. ఈ కేసులో కోర్టు ఎలాంటి కీలక ఆదేశాలు జారీ చేస్తుందోనని ఆసక్తికరంగా మారింది.

# పైశాచిక కాంగ్రెస్



- **ప్రజలను మోసం చేసి పాలన**
- **ఆరు గ్యారంటీల అమలుపై బీజేపీ చలో అసెంబ్లీ**
- **పోలీసుల అడ్డగింతపై ఆ పార్టీ ఎమ్మెల్యేల మండిపాటు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పైశాచికంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ప్రకటించిన 'ఆరు గ్యారెంటీలను' రెండేళ్లు గడిచినా అమలు చేయలేదని మండిపడ్డారు. హామీల అమలు కోరుతూ బీజేపీ చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని తెలిపారు. గతంలో కేసీఆర్ పాలన కంటే దారుణమైన నిర్బంధం ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో కనిపిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు, చేస్తున్న ఖర్చులకు పొంతన లేదని ఆ పార్టీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. ప్రజలకు ఆకర్షణీయమైన హామీలు ఇచ్చి గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


బంగారం– వెండి : అత్యవసరం లేకపోతే అమ్మకానికి తొందరపడొద్దు

యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

# రాష్ట్ర కుంటుబాల కంటే రేషన్ కార్డులే ఎక్కువ?

- తెలంగాణ ఉచిత బియ్యం పంపిణీపై 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' సంచలన నివేదిక!
- అర్హతల ఉల్లంఘనపై ఆందోళన



**ముద్ర, డెస్క్ :**

తెలంగాణలో ఉచిత బియ్యం పంపిణీ విధానంపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫుడ్ సెక్యూరిటీ కార్డుల జారీకి ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాలు అమలులో పాటించబడటం లేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆరోపించింది. ఎన్నికల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్రంలో సుమారు 85 శాతం కుటుంబాలకు ఉచిత తెల్ల బియ్యం అందుతున్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయని సంస్థ పేర్కొంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.5 లక్షల కంటే తక్కువగా, పట్టణాల్లో రూ.2 లక్షల కంటే తక్కువగా ఉండాలి. అలాగే కుటుంబానికి 3.5 ఎకరాల సాగు భూమి లేదా 7.5 ఎకరాల మెట్ట భూమి మాత్రమే ఉండాలి. అయితే ఈ ప్రమాణాలు అమలు కాకుండా విస్తృతంగా కార్డులు జారీ అవుతున్నాయని ఫోరం అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం తెలంగాణకు 1.2 కోట్ల మంది లబ్ధిదారులకు 54.67 లక్షల కార్డుల ద్వారా ఉచిత బియ్యం అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా లక్షల సంఖ్యలో కార్డులు జారీ చేయడం గమనార్హమని పేర్కొంది. గత ప్రభుత్వం 35.28 లక్షల కార్డులు జారీ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం మరో 15.12 లక్షల కొత్త కార్డులు మంజూరు చేసినట్లు తెలిపింది. దీంతో మొత్తం కార్డుల సంఖ్య 105 లక్షలకు చేరిందని, సగటున ప్రతి కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నట్లు తీసుకుంటే 4.2 కోట్ల మందికి ఉచిత బియ్యం అందుతున్నట్లు అవుతుందని వెల్లడించింది. ఇది రాష్ట్ర జనాభా కంటే ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

**అంకాపూర్‌లో సర్వే సంచలనం**


నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఆశ్చర్యకర విషయాలు బయటపడ్డాయని ఫోరం తెలిపింది. రాష్ట్రంలో అత్యంత సంపన్న గ్రామంగా గుర్తింపు పొందిన అంకాపూర్‌లో 1804 కుటుంబాల్లో 1225 కుటుంబాలు ఉచిత బియ్యం పొందుతున్నట్లు గుర్తించారు. గ్రామంలో వందల సంఖ్యలో వాహనాలు, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అందుతున్నట్లు వెల్లడైంది. అర్హత ప్రమాణాలు కచ్చితంగా అమలు చేస్తే గరిష్ఠంగా 300 కుటుంబాలకే అర్హత ఉంటుందని ఫోరం తెలిపింది.రంగారెడ్డి జిల్లాలో 98% కుటుంబాలకు బియ్యం దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాల్లో ఒకటైన రంగారెడ్డిలో 5.63 లక్షల కుటుంబాలకు గాను 5.56 లక్షల కుటుంబాలకు ఫుడ్ సెక్యూరిటీ కార్డులు జారీ కావడం గమనార్హమని పేర్కొంది. అంటే దాదాపు 98.7 శాతం కుటుంబాలు ఉచిత బియ్యం పొందుతున్నట్లు వివరించింది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.12 లక్షలు ఉండగా, బియ్యం అర్హత పరిమితి రూ.2 లక్షలు మాత్రమే ఉండటం మధ్య వ్యత్యాసం ఉన్నప్పటికీ భారీగా కార్డులు జారీ అవుతున్నాయని విమర్శించింది.

**సమగ్ర దర్యాప్తు కోరిన ఫోరం**

తెలంగాణ దేశంలో సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, పెద్ద మొత్తంలో ప్రజలను పేదలుగా పరిగణించి ఉచిత బియ్యం పంపిణీ చేయడం ఆర్థిక భారం పెంచుతోందని ఫోరం అభిప్రాయపడింది. అర్హత లేని లబ్ధిదారులను తొలగించాలన్న కేంద్ర సూచనలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో తెల్ల రేషన్ కార్డులపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ప్రజా నిధుల వృథాను నివారించాలని ముఖ్యమంత్రిని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి వినయపూర్వకంగా కోరారు.

# మాజీ మంత్రి మైండ్ గేమ్

- కాంగ్రెస్ వ్యతిరేకవర్గాన్ని మచ్చిక చేసుకుంటున్న బీఆర్ఎస్
- పాలమూరులో వల విసురుతున్న వైనం
- చీలిన కాంగ్రెస్ నేతలతో చెట్టాపట్టాల్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల లోపు కలిపేందుకు యత్నం
- పావులు కదుపుతున్న మాజీ మంత్రి




ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి: పాలమూరు రాజకీయ రణరంగంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికిని నిలబెట్టుకునేందుకు మైండ్ గేమ్ మొదలుపెట్టింది. ఇప్పటికే అ పార్టీ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తనదైన స్టైల్ లో ప్రణాళిక రెడీ చేసుకుంటున్నారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యే, అందులో ఇదేళ్ల పాటు మంత్రి గా పనిచేసిన ఆయన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందారు. పాలమూరులో ఎవ్వరూ చేయనంత అభివృద్ధి చేస్తే ఓటమి తనకు గిఫ్ట్ గా ఇచ్చారని ఆవేదన చెందారు. ఓటమిని జీర్ణించుకోలేని ఆయన వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ ఉనికిని కాపాడేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. ఇందుకోసం బీసీ నినాదాన్ని అధికంగా ప్రమోట్ చేస్తున్నారు. కానీ కొందరు బీసీ నేతలు మాత్రం ఆయన తీరుపై విమర్శలు చేస్తున్నారు. అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలోని బీసీలపై అనవసరమైన కేసులు పెట్టి జైలుకు పంపించిన విషయం మరిచిపోయారా అని కొందరు బీసీ నేతలు మండిపడుతున్నారు. ఇటీవల కొందరు బీసీ నేతలు మీడియా సమావేశం లో మాజీ మంత్రి తీరును ఎండగట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు బీసీ నినాదం ఎత్తుకోవడం చూస్తే ఆయనకు బీసీలపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందని అ సంఘం నేతలే ఆరోపణలు చేస్తున్నారు. బీసీ నినాదంతో పాటు కాంగ్రెస్ పార్టీ లో నుంచి ముఖ్య మైన నేతలను బీఆర్ఎస్ వైపు లాగేందుకు సమయం చూస్తూ వచ్చారు. మున్సిపల్ ఎన్నికలు ఇందుకు దారి చూపినట్లయింది. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినా మేయర్ పదవి విషయంలో పార్టీ నేతలు రెండుగా చీలిపోయారు. ముందుగానే అనుకున్న విధంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ భార్యకు మేయర్ గా నియమించాలని కాంగ్రెస్ అధిష్టానం నుంచి సాంకేతాలు వచ్చాయి. ఈ ఆనంద్ గౌడ్ గతంలో శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అనుచరుడిగా గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి మున్సిపల్ చైర్మన్ గా ఆనంద్ గౌడ్ కు అప్పుడు మంత్రిగా ఉన్న శ్రీనివాస్ గౌడ్ అవకాశం ఇచ్చారు. మూడేళ్ల తరువాత ఇద్దరి మధ్య తగాదాలు రావడంతో ఆనంద్ గౌడ్ బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు. ఆయనతో పలువురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ వీడడం శ్రీనివాస్ గౌడ్ కు అవమానం జరిగినట్లయింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య పచ్చ గడ్డి వేసినా మండే చందంగా పరిస్థితి వచ్చింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆనంద్ గౌడ్ భార్య కు మేయర్ పదవి ఇవ్వకపోవడంతో ఆయన మనస్థాపానికి గురయ్యారు. ఇదంతా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వల్లే తన భార్య కు మేయర్ పదవి రాలేదని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో యెన్నం కు మద్దతుగా నిలిచి ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించిన తనకే ఇలా మేయర్ పదవి రాకుండా అడ్డుకుంటారా అని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఆనంద్ గౌడ్ భార్యకు మేయర్ పదవి ఇవ్వాలని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, డీసీసీ మాజీ అధ్యక్షులు ఒబేదుల్ల కొత్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత పట్టుబట్టారు. ఒబేదుల్ల కొత్వాల్ కూడా తన కుమారునికి డిప్యూటీ మేయర్ కావాలని పట్టుబట్టారు. ఇదేమి పట్టించుకోని ఎమ్మెల్యే యెన్నం మేయర్ పదవి ముదిరాజ్ ఆడబిడ్డ మమత, డిప్యూటీ మేయర్ గా సురేందర్ రెడ్డికి పదవులు ఇచ్చారు. దీంతో ఈ నేతలు ఎమ్మెల్యే పై గుర్రుగా ఉన్నారు. వీరంతా ఒక్కటై ఆయన కార్యక్రమాలకు దూరంగా ఉంటూ కాంగ్రెస్ నుంచి చీలిపోయారు. కాంగ్రెస్ లో ఇంత తతంగం జరగడంతో బీఆర్ఎస్ కు కలిసివస్తుందని శ్రీనివాస్ గౌడ్ తన హ్యూహం మొదలు పెట్టారు. ఎమ్మెల్యే యెన్నం కు దూరంగా ఉంటున్న కాంగ్రెస్ నేతలను తన వైపునకు తిప్పుకునే పనిలో పడ్డారనే సమాచారం అందుతోంది. ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నం జరుగుతున్నట్లు తెలిసింది. ఇటీవల ఓ ఫంక్షన్ హాల్ జరిగిన బీసీల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఇదే సమావేశంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఇద్దరు పక్కపక్కనే కూర్చోవడం చర్చకు దారితీసింది. స్టేజిపై ఇద్దరు ముచ్చట్లు పెట్టిన తీరుకు అందరూ ఆశ్చర్యపోయారు. ఇక్కడే కాకుండా రంజాన్ రోజు ఈద్గ వద్ద కూడా ఇద్దరు పక్కపక్కనే కూర్చున్నారు. సమీపంలో ఎమ్మెల్యే ఉన్నా సంజీవ్ ఆయనను పట్టించుకోకుండా శ్రీనివాస్ గౌడ్ తో మాట్లాడం పలువురు కాంగ్రెస్ నేతలకు మింగుడు పడలేదు. ఇక్కడే ఒబేదుల్ల కొత్వాల్ కూడా ఎమ్మెల్యే ను పట్టించుకోకుండా శ్రీనివాస్ గౌడ్ తో ముచ్చట్లు పెట్టారు. ఇదంతా అక్కడే ఉన్న కాంగ్రెస్ ఇతర నేతలు వారి తీరునుఎండగడుతున్నారు. వీరితో పాటు లోలోపల ఆనంద్ గౌడ్ కూడా శ్రీనివాస్ గౌడ్ టచ్ లో ఉన్నట్లు కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అవకాశం తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో మాజీ మంత్రి పడ్డారు. ఈ రెండు, మూడు సంఘటనలే కాకుండా ఈ చీలిన కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రికి అప్పుడప్పుడు టచ్ లో ఉంటున్నారని ఎమ్మెల్యే వర్గం నేతలు ఆరోపిస్తున్నారు.

# ఓయాసిస్ ఫెర్టిలిటీ, ఓయాసిస్ సారథి యాప్ ప్రారంభం





**ముద్ర, హైదరాబాద్ :**

భారతదేశ సంతాన సాఫల్య సంరక్షణ రంగంలో విశ్వసనీయమైన అగ్రగామి సంస్థ అయిన ఓయాసిస్ ఫెర్టిలిటీ, వ్యక్తులు మరియు జంటలకు వారి సంతాన సాఫల్య ప్రయాణంలో నమ్మకమైన వైద్య సమాచారం, చికిత్స మార్గదర్శకత్వం మరియు రోగి సంరక్షణ సేవలతో మద్దతు ఇచ్చేందుకు రూపొందించిన డిజిటల్ వేదిక అయిన ఓయాసిస్ సారథి యాప్‌ను ప్రారంభించింది. ఈ యాప్, సంతాన సాఫల్య పరిజ్ఞానాన్ని సులభతరం చేయడంతో పాటు, చికిత్స అంతటా రోగులు తమ క్లినికల్ కేర్ బృందాలతో అనుసంధానమై ఉండటానికి సహాయపడటాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. తల్లిదండ్రులు కావాలనే ప్రయాణంలో ఒకరి "సారథి"గా, అంటే నమ్మకమైన తోడుగా పనిచేస్తూ, ఈ యాప్ వినియోగదారులు తమ సంతాన సాఫల్య ఆరోగ్యాన్ని మరింత బాగా అర్థం చేసుకోవడానికి, వంధ్యత్వానికి గల కారణాలు, లక్షణాలు, చికిత్సపై అవగాహనను మెరుగుపరచుకోవడానికి సహాయపడే అనేక ఫీచర్లను అందిస్తుంది. అండోత్పత్తి ట్రాకర్ మరియు సంతాన సాఫల్య ఆరోగ్య తనిఖీ వంటి సాధనాలతో పాటు, బ్లాగులు, వ్యాసాలు, కమ్యూనిటీ, న్యూస్‌లెటర్‌లతో, ఓయాసిస్ సారథి యాప్ విశ్వసనీయమైన, ఆధారఆధారిత సంతాన సాఫల్య విజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, నమ్మదగిన సమాచారాన్ని నేరుగా వినియోగదారుల అందుబాటులో ఉంచుతుంది. సంతానలేమి సవాళ్లు పెరగడం, ఆరోగ్య సమాచారం కోసం ఆన్‌లైన్ వనరులపై ఆధారపడటం అధికమవడంతో, చాలామంది వ్యక్తులు పునరుత్పత్తి ఆరోగ్యం గురించి కచ్చితమైన, విశ్వసనీయమైన మార్గదర్శకత్వాన్ని గుర్తించడంలో ఇబ్బంది పడుతున్నారు. ఓయాసిస్ సారథి యాప్, శాస్త్రీయ ఆధారాలతో కూడిన సంతానలేమి విద్యను అందించడంతో పాటు, పదేపదే గర్భస్రావాలు, పీసీఓలు, పీసీఓడీ, అధిక వయస్సులో గర్భం దాల్చడం, తక్కువ వీర్యకణాల సంఖ్య, సంతానలేమిని ప్రభావితం చేసే ఇతర కారకాలతో సహా అనేక రకాల పునరుత్పత్తి ఆరోగ్య సమస్యలను వినియోగదారులు బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడే సాధనాలను అందించడం ద్వారా ఈ అంతరాన్ని పూరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ యాప్‌లో నిజ జీవిత రోగుల విజయ గాథలు, కమ్యూనిటీ ఫోరమ్‌లు కూడా ఉన్నాయి. ఇక్కడ వినియోగదారులు తమలాంటి సంతానలేమి సవాళ్లను ఎదుర్కొంటున్న ఇతరులతో సంభాషించవచ్చు, తద్వారా వారు తమ అనుభవాలను పంచుకోవడానికి, పునరుత్పత్తి ఆరోగ్యం గురించి మరింత తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. విద్యా వనరులతో పాటు, ఓయాసిస్ సారథి యాప్ రోగి యొక్క సంతానలేమి ప్రయాణం అంతటా వ్యక్తిగతీకరించిన, శాస్త్రీయ ఆధారిత సహచరుడిగా పని చేస్తుంది. ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా రోగులు తమ చికిత్సా మార్గపటాన్ని (ట్రీట్‌మెంట్ రోడ్‌మ్యాప్) చూడవచ్చు, నిజ సమయంలో నివేదికలు, తాజా సమాచారాన్ని పొందవచ్చు, అపాయింట్‌మెంట్లను షెడ్యూల్ చేసుకోవచ్చు మరియు వారి వైద్య బృందాలతో సంభాషించవచ్చు. సమాచార లభ్యతను సులభతరం చేయడం, రోగులు, వైద్యుల మధ్య సంభాషణను మెరుగుపరచడం ద్వారా ఈ యాప్ అనిశ్చితిని తగ్గించి, చికిత్సా ప్రక్రియ అంతటా ఎక్కువ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు మాట్లాడుతూ సంతానోత్పత్తి సంరక్షణ ఎల్లప్పుడూ శాస్త్రం, సమాచారంతో కూడిన నిర్ణయాల ద్వారా మార్గనిర్దేశం చేయబడాలని, ఒయాసిస్ సారథి ద్వారా తాము విశ్వసనీయమైన, ఆధారఆధారిత సంతానోత్పత్తి విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా వ్యక్తులు వారి పునరుత్పత్తి ఆరోగ్యం, చికిత్సా ఎంపికలను మరింత బాగా అర్థం చేసుకోగలరని తెలిపారు.

# యుద్ధానికి బ్రేక్

- 5 రోజులపాటు దాడులకు బ్రేక్.. ట్రంప్ కీలక ప్రకటన
- ఇరాన్– అమెరికా మధ్య చర్చలు ఫలితం
- పవర్ ప్లాంట్లపై దాడులు నిలిపివేతపై ట్రూత్ సోషల్‌లో ట్రంప్ వెల్లడి
- ఉద్రిక్తతల మధ్య ఊరట..
- ఈ వారం చర్చలు కొనసాగింపు



**ముద్ర, డెస్క్:**

ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త యుద్ధ పరిస్థితుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. కొన్ని వారాలుగా తీవ్రరూపం దాల్చిన ఈ యుద్ధంలో తాత్కాలిక విరామం ప్రకటిస్తూ, వచ్చే ఐదు రోజుల పాటు మిలిటరీ దాడులను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లు, ఎనర్జీ మౌలిక సదుపాయాలపై జరగాల్సిన దాడులను వాయిదా వేస్తున్నామని ట్రంప్ తెలిపారు. ట్రంప్ తన అధికారిక సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తూ, ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూల ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు. రెండు రోజులుగా ఇరు దేశాల మధ్య జరిగిన రహస్య చర్చలు కీలక దశకు చేరుకున్నాయని, ఈ చర్చల నేపథ్యంలోనే తాత్కాలికంగా దాడులు ఆపాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. ఈ పరిణామం అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారి ఇరు దేశాలు చర్చల బాట పట్టడం విశేషం. ఇది భవిష్యత్తులో శాంతి చర్చలకు మార్గం సుగమం చేసే సూచనగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విరామం శాశ్వత పరిష్కారానికి దారితీస్తుందా లేదా అన్నది ఇప్పటికీ అనుమానంగానే ఉంది. ఈ వారం మొత్తం చర్చలు కొనసాగుతాయని, సమస్యలకు శాంతియుత పరిష్కారం కనుగొనే దిశగా కృషి జరుగుతోందని ట్రంప్ మరో ప్రకటనలో తెలిపారు. ఇరాన్ వైపు నుంచి కూడా చర్చల పట్ల సానుకూల స్పందన వచ్చినట్లు సమాచారం. అయితే అధికారికంగా ఇరాన్ ప్రభుత్వం ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు. మరోవైపు యుద్ధం వల్ల గ్లోబల్ మార్కెట్‌పై, ముఖ్యంగా చమురు ధరలపై తీవ్ర ప్రభావం పడింది. హార్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ వాణిజ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో తాత్కాలిక విరామం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊరట కలిగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ విరామం కేవలం వ్యూహాత్మక నిర్ణయమా, లేక నిజంగా శాంతి దిశగా అడుగులా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. ప్రస్తుతం మాత్రం యుద్ధ మేఘాల మధ్య చిన్న శాంతి కిరణంగా ఈ ప్రకటన నిలిచింది.

# టీజీ సెట్‌లో మెరిసిన ముగ్గురు అధ్యాపకులు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :**



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకులు టీజీ సెట్‌లో అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సైన్స్ విభాగానికి చెందిన బాదం నరేష్, ఇంగ్లీష్ విభాగానికి చెందిన ఎత్తం రమ్య రెడ్డి అలాగే కంప్యూటర్ సైన్స్ విభాగంలో టీఎస్కేసీ మెంటర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ టీజీ సెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఒకేసారి ముగ్గురు అధ్యాపకులు స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అర్హత సాధించడంతో కళాశాలలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, టీజీ సెట్ ఉత్తీర్ణులైన అధ్యాపకుల కృషిని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో మహమ్మద్ ఇర్ఫాన్ అధ్యాపకులు అంజయ్య, వనిత, కోదండరాములు, రామకృష్ణ, దశరథ, ముజఫర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

TATA AIA
LIFE INSURANCE

# టాటా ఏఐఏ మూడు కొత్త నిధులు ప్రారంభం

**ముద్ర, ముంబై :**

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ మూడు కొత్త పెట్టుబడి నిధులను ప్రారంభించింది. లార్జ్ మిడ్ క్యాప్ ఇన్నోవేషన్ ఫండ్, లార్జ్ మిడ్ క్యాప్ ఇన్నోవేషన్ పెన్షన్ ఫండ్, గ్లోబల్ ఏఐ అండ్ టెక్నాలజీ లీడర్స్ ఫండ్ పేర్లతో ఈ నిధులు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఫండ్లు యూనిట్ లింక్ ఇన్సూరెన్స్ ప్లాన్ల (యూలిప్స్) ద్వారా పెట్టుబడిదారులకు జీవిత బీమా రక్షణతో పాటు పెట్టుబడి అవకాశాలను కల్పిస్తాయి. దేశీయంగా ఆవిష్కరణల ఆధారిత రంగాలు, అంతర్జాతీయంగా సాంకేతిక పురోగతులలో పెట్టుబడి పెట్టే అవకాశం వీటి ద్వారా లభిస్తుంది. కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) మార్చి 24 నుంచి 31 వరకు కొనసాగుతుంది. దేశీయ ఫండ్ల యూనిట్ ధర రూ.10గా, గ్లోబల్ ఫండ్ యూనిట్ ధర $10గా నిర్ణయించారు. కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ హర్షద్ పాటిల్ మాట్లాడుతూ ఆవిష్కరణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మార్చుతున్నాయని, ఈ నిధుల పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక సంపద సృష్టి అవకాశాలను అందించింది. భారతదేశంలోని లార్జ్, మిడ్ క్యాప్ వినూత్న కంపెనీలు, అలాగే గ్లోబల్ ఏఐ, సెమీకండక్టర్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే విధంగా ఈ నిధులు రూపుదిద్దుకున్నాయి. పెట్టుబడిదారులు తమ ఆర్థిక భవిష్యత్తును బలపరచుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని సంస్థ అందిస్తుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బంగారం– వెండి :
లాంగ్ టర్మ్ దృష్టితో పెట్టుబడి పెట్టండి
బంగారం తాత్కాలిక లాభాల కోసం కాకుండా భద్ర పెట్టుబడి.





## 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై ఐపీఎల్‌లో భారీ అంచనాలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

చాలా మంది క్రికెటర్లు ఐపీఎల్‌లో అవకాశమే రాకముందే ఏళ్ల తరబడి కష్టపడాల్సి వస్తుంది. అలాంటిది కేవలం 14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో అడుగుపెట్టి తన విధ్వంసక బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు వైభవ్ సూర్యవంశీ. గత సీజన్‌లో అతడు ఆడిన మెరుపు ఇన్నింగ్స్ ఇప్పటికీ అభిమానుల మదిలో నిలిచేలా చేసింది. ఇప్పుడు మరోసారి ఐపీఎల్ ముంగిట అతడిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐపీఎల్ ప్రారంభమవుతుంటే సాధారణంగా అభిమానుల దృష్టి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, మహేంద్ర సింగ్ ధోని లాంటి స్టార్ ఆటగాళ్లపైనే ఉంటుంది. కానీ ఈసారి మాత్రం ఆ స్టార్‌లతో పాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారాడు. చిన్న వయసులోనే అతడు చూపించిన ధైర్యమైన బ్యాటింగ్ శైలి అభిమానులను బాగా ఆకట్టుకుంది. గత ఏడాది వేలంలో రాజస్థాన్ రాయల్స్ ఈ కుర్రాడిపై ఏకంగా రూ.1.10 కోట్లు పెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. 14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ మ్యాచ్ ఆడి, కేవలం 35 బంతుల్లో సెంచరీ సాధించి సంచలనం సృష్టించాడు. ఆ సీజన్‌లో మొత్తం 7 మ్యాచ్‌ల్లో 252 పరుగులు చేసి తన టాలెంట్‌ను రుజువు చేశాడు. ఐపీఎల్ తర్వాత అండర్ 19 స్థాయిలో కూడా వైభవ్ తన మెరుపు ఫామ్‌ను కొనసాగించాడు. ఆసియా కప్, ఇతర యువ టోర్నీల్లో కూడా వేగంగా పరుగులు చేసి మరోసారి తన పేరు వినిపించాడు. ఈ సీజన్‌లో కూడా అదే ఫామ్‌ను కొనసాగిస్తే అతడు త్వరలోనే టీమ్ ఇండియాలో చోటు సంపాదించే అవకాశముందని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే ఈసారి సవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. గత ఏడాది అతడి ఆటను అన్ని జట్లూ గమనించాయి. కాబట్టి అతడిని ఔట్ చేయడానికి బౌలర్లు ప్రత్యేకంగా ప్లాన్ చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ తన ప్రతిభను మరోసారి నిరూపిస్తే, ఈ చిన్న వయసులోనే ఐపీఎల్‌లో స్టార్ ప్లేయర్‌గా మారే అవకాశం వైభవ్ సూర్యవంశీకి ఉంది.



## ఈసారి కేకేఆర్ కథ మారుతుందా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో అత్యధిక ట్రోఫీలు గెలిచిన జట్లలో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ తర్వాత అద్భుతమైన రికార్డు ఉన్న జట్టుగా కోల్‌కతా నైట్ రైడర్స్ పేరు సంపాదించింది. 2024 సీజన్‌లో ఫైనల్లో హైదరాబాద్ జట్టును ఓడించి కోల్‌కతా మూడోసారి ట్రోఫీని గెలిచింది. అంతకుముందు 2012, 2014లో కూడా విజేతగా నిలిచి త్రీ స్టార్ ఛాంపియన్‌గా గుర్తింపు పొందింది. అయితే డిఫెండింగ్ ఛాంపియన్‌గా గత సీజన్‌లో బరిలోకి దిగిన కోల్‌కతా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. దారుణమైన ప్రదర్శనతో అభిమానులను నిరాశపరిచింది. ఇప్పుడు మరో ఐదు రోజుల్లో కొత్త సీజన్ ప్రారంభం కానుండగా ఈసారి జట్టు ఎలా ఆడుతుందో అన్న ఆసక్తి నెలకొంది. ఐపీఎల్ చరిత్రలో కోల్‌కతా నాలుగు సార్లు ఫైనల్‌కు చేరింది. అందులో మూడు సార్లు ట్రోఫీని గెలుచుకుని అరుదైన రికార్డు సృష్టించింది. 2026 సీజన్‌లో మాత్రం మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని జట్టు భావిస్తోంది. ఈసారి అజింక్య రహానే నాయకత్వంలో బరిలోకి దిగుతున్న కేకేఆర్.. గత సీజన్ ఫలితాన్ని మరచి కొత్త ఆరంభం చేయాలని చూస్తోంది. ఈ సీజన్ మాదే అని రహానే కూడా ధీమాగా చెబుతున్నాడు. జట్టులో గ్రీన్ కీలక ఆటగాడిగా మారాడు. వేలంలో అతడిపై భారీ మొత్తం ఖర్చు పెట్టడం జట్టు ఆశలను చూపిస్తోంది. సునీల్ నరైన్, టిమ్ సిఫెర్ట్, ఫిన్ అలెన్, రింకు సింగ్ వంటి ఆటగాళ్లు బ్యాటింగ్‌కు బలం. రఘువంశీ, రమణదీప్ సింగ్, రాహుల్ త్రిపాఠి లాంటి యువ ఆటగాళ్లు కూడా మ్యాచ్‌ను మలుపుతిప్పగల సామర్థ్యం కలవారు. అయితే బౌలింగ్ మాత్రం కేకేఆర్‌కు ప్రధాన సమస్యగా కనిపిస్తోంది. పేస్ బౌలర్లు గాయాల కారణంగా దూరమవడంతో స్పిన్నర్లపై ఎక్కువ బాధ్యత పడుతోంది. సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి తమ స్పిన్‌తో జట్టును ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. పేస్ బౌలింగ్ బలంగా లేకపోతే జట్టుకు ఇబ్బందులు తప్పవు. ఇప్పటివరకు కోల్‌కతా ఐపీఎల్‌లో 265 మ్యాచ్‌లు ఆడి 136 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. 127 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మూడు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు.. ఈసారి మళ్లీ ట్రోఫీ కోసం గట్టిగా పోరాడేందుకు సిద్ధమవుతోంది

## ఐపీఎల్ ఫ్యాన్ పార్కులతో సందడి మొదలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

అంతర్జాతీయ, దేశవాళీ క్రికెటర్లతో కళకళలాడే ఐపీఎల్ 2026 సీజన్ మరో ఐదు రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే జట్లు ప్రాక్టీస్ మ్యాచులతో బిజీగా ఉన్నాయి. పూర్తి షెడ్యూల్ విడుదల చేయకపోయినా తొలి 20 మ్యాచుల జాబితాను ప్రకటించారు. మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ సీజన్ కోసం అభిమానుల కోసం ప్రత్యేకంగా ఫ్యాన్ పార్కులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఫ్యాన్ పార్కులో లైవ్ మ్యాచ్ స్క్రీనింగ్ ఉంటుంది. మ్యూజిక్, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు, ఫుడ్ కోర్టులు, చిన్నారుల కోసం ప్రత్యేక గేమ్ జోన్‌లు ఏర్పాటు చేస్తారు. వర్చువల్ బ్యాటింగ్, బౌలింగ్ నెట్స్, ఫేస్ పెయింటింగ్, ఫొటో బూత్‌లు వంటి ఆకర్షణలు కూడా ఉంటాయి. ఈ ఫ్యాన్ పార్క్ ఆలోచనను బీసీసీఐ 2015లో మొదలుపెట్టింది. మూడు వారాంతాల్లో దేశంలోని 15 నగరాల్లో ఈ ఫ్యాన్ పార్కులు నిర్వహించనున్నారు. మార్చి 28, 29 తేదీల్లో రోహ్‌తక్, భోపాల్, నాగ్‌పుర్, తుమకూరు, కృష్ణా నగర్‌లో మొదటి విడత కార్యక్రమాలు ఉంటాయి. ఏప్రిల్ 4, 5 తేదీల్లో మథుర, జోధ్‌పుర్, మైసూరు, భువనేశ్వర్, నిజామాబాద్‌లో రెండో విడత నిర్వహిస్తారు. ఏప్రిల్ 11, 12 తేదీల్లో మేరఠ్, నడియాద్, రత్నగిరి, కోయంబత్తూర్, రవూర్కెలాలో మూడో విడత ఫ్యాన్ పార్కులు నిర్వహించనున్నారు. ఫ్యాన్ పార్కుల ద్వారా స్టేడియానికి వెళ్లలేని అభిమానులు కూడా ఐపీఎల్ ఉత్సాహాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదించే అవకాశం లభించనుంది






## స్టార్క్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ ఎదురు చూపులు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో మిచెల్ స్టార్క్ చేరికపై ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 1న తమ తొలి మ్యాచ్ ఆడనున్న ఢిల్లీ, ఆలోగా స్టార్క్ జట్టుతో కలుస్తాడన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ప్రీ సీజన్ మీడియా సమావేశంలో కెప్టెన్ అక్షర్ పటేల్‌తో పాటు కోచ్ హేమంగ్ బదానీ, డైరెక్టర్ వేణుగోపాల్ రావు ఈ విషయంపై మాట్లాడారు. స్టార్క్ అందుబాటులోకి వచ్చే విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి ఎన్‌వోసీ కోసం ఎదురు చూస్తున్నామని జట్టు వర్గాలు వెల్లడించాయి. ఎన్‌వోసీ వచ్చిన తర్వాతే అతడు ఎప్పుడు జట్టుతో చేరతాడో స్పష్టత వస్తుందని చెప్పారు. ప్రస్తుతం క్రికెట్ ఆస్ట్రేలియాతో నిరంతరం సంప్రదింపులు కొనసాగుతున్నాయని, అతడి ఫిట్‌నెస్‌పై అక్కడి బోర్డు నుంచి అనుమతి వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంపై కెప్టెన్ అక్షర్ పటేల్ కూడా స్పందించాడు. స్టార్క్ తొలి మ్యాచ్‌కు ముందు జట్టుతో చేరే అవకాశం ఉందని, కానీ ఇప్పుడే ఖచ్చితంగా చెప్పడం కష్టమని పేర్కొన్నాడు. ఒకవేళ స్టార్క్ అందుబాటులోకి రాకపోయినా జట్టుకు పెద్ద సమస్య ఉండదని, ఇప్పటికే నటరాజన్ వంటి ఎడమ చేతి పేసర్ జట్టులో ఉండటం తమకు ప్లస్ పాయింట్ అని తెలిపాడు. స్టార్క్ చేరికపై స్పష్టత రాకపోయినా, ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం సీజన్‌ను బలంగా ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పుడు స్టార్క్ ఎప్పుడు జట్టుతో కలుస్తాడన్నదే అభిమానుల్లో ఆసక్తిగా మారింది.

## బెదిరింపుల మధ్య పాక్‌కు చేరుకున్న స్టీవ్ స్మిత్



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ స్టీవ్ స్మిత్ పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026లో ఆడేందుకు లాహోర్‌కు చేరుకున్నాడు. జమాత్ ఉల్ అహ్రార్ నుంచి విదేశీ ఆటగాళ్లకు బెదిరింపులు వచ్చినప్పటికీ స్మిత్ మాత్రం పాక్ గడ్డపై అడుగుపెట్టాడు. లాహోర్ ఎయిర్‌పోర్ట్‌లో అతనికి ఘన స్వాగతం లభించగా, కట్టుదిట్టమైన భద్రత మధ్య ముల్తాన్ సుల్తాన్స్ జట్టు బస చేసే హోటల్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విదేశీ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని జమాత్ ఉల్ అహ్రార్ విభాగం హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, డారిల్ మిచెల్ వంటి ఆటగాళ్లు వెంటనే టోర్నీ నుంచి తప్పుకోవాలని, లేదంటే వారి భద్రతకు తాము బాధ్యులం కాదని ఆ సంస్థ ప్రకటించింది. అయినప్పటికీ విదేశీ క్రికెటర్లు ఒక్కొక్కరుగా పాకిస్థాన్‌కు చేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కూడా కీలక నిర్ణయం తీసుకుంది. భద్రతా కారణాలు, ఇంధన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మ్యాచ్‌లను ఖాళీ స్టేడియాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా కేవలం రెండు వేదికల్లోనే మ్యాచ్‌లు జరపాలని నిర్ణయించింది. పీఎస్ఎల్ 11వ సీజన్ మార్చి 26 నుంచి ప్రారంభం

## పీఎస్ఎల్‌కు మిలిటెంట్ గ్రూప్ హెచ్చరికలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**


పాకిస్థాన్ సూపర్ లీగ్ ప్రారంభానికి ముందే మరోసారి భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇప్పటికే ప్రేక్షకులు లేకుండా, కేవలం రెండు వేదికల్లోనే పీఎస్ఎల్‌ను నిర్వహిస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మిలిటెంట్ గ్రూప్ నుంచి వచ్చిన హెచ్చరికలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. పాకిస్థాన్‌కు చెందిన జమాత్ ఉల్ అహ్రార్ అనే మిలిటెంట్ సంస్థ విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్‌లో పాల్గొనవద్దంటూ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్‌కు వస్తే భద్రత ఉండదని పేర్కొంది. తాము క్రికెట్‌కు వ్యతిరేకం కాదని చెబుతూనే, ఈ సమయంలో పాకిస్థాన్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే స్థితిలో లేదని ఆ సంస్థ వెల్లడించింది. సంబంధిత దేశాల క్రికెట్ బోర్డులు తమ ఆటగాళ్లను పాకిస్థాన్‌కు పంపొద్దని కూడా ఆ గ్రూప్ సూచించింది. ఆటగాళ్లకు ఏదైనా జరిగితే తమ బాధ్యత కాదని హెచ్చరించింది. పీఎస్ఎల్ మ్యాచ్‌లు జరగకుండా ప్రయత్నిస్తామని కూడా పేర్కొనడంతో భద్రతా అంశం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. ఈ సీజన్‌లో డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, డారిల్ మిచెల్, ఆడమ్ జంపా, మొయిన్ అలీ, డెవన్ కాన్వేలాంటి విదేశీ ఆటగాళ్లు పాల్గొనాల్సి ఉంది. ఈ హెచ్చరికల నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లు పాకిస్థాన్‌కు వస్తారా లేదా అనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. షెడ్యూల్ ప్రకారం పీఎస్ఎల్ మార్చి 26న ప్రారంభం కావాల్సి ఉంది.




## ఫ్యాన్ మీట్‌లో నవ్వులు పూయించిన సన్‌రైజర్స్ ఆటగాళ్లు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు తాజాగా అభిమానులతో ప్రత్యేకంగా ఫ్యాన్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ ఇషాన్ కిషన్, వైస్ కెప్టెన్ అభిషేక్ శర్మతో పాటు తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, జయదేవ్, హర్షల్ పటేల్ పాల్గొన్నారు. అభిమానులు అడిగిన ప్రశ్నలకు ఆటగాళ్లు సరదాగా సమాధానాలు ఇస్తూ కార్యక్రమాన్ని సందడిగా మార్చారు. ఈ సందర్భంగా నితీశ్ కుమార్ రెడ్డిని అభిమానులు వరుసగా ప్రశ్నలు అడిగారు. టీ20లు లేదా టెస్టుల్లో ఏ ఫార్మాట్ ఇష్టమని అడిగితే.. నితీశ్ టీ20లు ఇష్టమని చెప్పాడు. వెంటనే ఇషాన్ కిషన్ మధ్యలో కలగజేసుకుని నువ్వు టెస్టుల్లో కూడా ఆడుతున్నావు కాబట్టి టెస్టులు కూడా ఇష్టమే అని చెప్పాలని సరదాగా వ్యాఖ్యానించాడు. టీ20లు లేదా వన్డేలు ఏవి ఇష్టమని మరో ప్రశ్న అడిగితే నితీశ్ వన్డేలు ఇష్టమని చెప్పాడు. అలాగే పవర్ ప్లేలో ఆడటమా లేదా డెత్ ఓవర్లలో ఆడటమా అని అడిగితే పవర్ ప్లేలో ఆడటం ఇష్టమని చెప్పాడు. దీనిపై ఇషాన్ మళ్లీ నవ్వుతూ నితీశ్ సాధారణంగా ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడని, అలాంటప్పుడు పవర్ ప్లేలో ఎలా ఆడతావని సరదాగా అడిగాడు. దీనికి నితీశ్ జట్టు కోసం ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధమని చెప్పడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. చివరగా ఇషాన్ కిషన్ నవ్వుతూ కేవలం తప్పు సమాధానాలు చెప్పాలని మీరేమైనా అడిగారా అని కామెంట్ చేయడంతో ఫ్యాన్ మీట్ మొత్తం నవ్వులతో మార్మోగింది. కార్యక్రమం మొత్తం సరదా వాతావరణంలో సాగి అభిమానులను బాగా అలరించింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బంగారం – వెండి : నకిలీ ఆఫర్లకు దూరంగా ఉండండి
"తక్కువ ధరకు బంగారం" అని చెప్పేవారిపై నమ్మకం పెట్టుకోవద్దు.





## ఆకాంక్ష శర్మ అందాల విందు

ముద్ర, సినిమా డెస్క్ :

గ్లామర్ లుక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్ ఆకాంక్ష శర్మ మరోసారి స్టైలిష్ ఫొటో షూట్‌తో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. తాజాగా విడుదలైన ఫొటోలో బ్లాక్ హాల్టర్ నెక్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన ఆమె బోల్డ్ లుక్‌తో పాటు కాన్ఫిడెన్స్‌ను కూడా అద్భుతంగా చూపించింది. వైట్ బ్యాక్‌డ్రాప్‌పై ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. స్మోకీ ఐస్ మేకప్, వేవీ హెయిర్ స్టైల్, స్టైలిష్ జ్యువెలరీతో ఆకాంక్ష మరింత గ్లామర్‌గా కనిపిస్తోంది. ఒక్క ఫొటోలోనే ఆమె స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ స్పష్టంగా కనిపిస్తోందని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. గ్లామర్‌తో పాటు ఆత్మ విశ్వాసాన్ని చూపించే ఈ ఫొటో షూట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. సినిమాల విషయానికి వస్తే, 'లైలా' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆకాంక్ష శర్మ, ఆ సినిమాలో జెన్నీ పాత్రలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే 'కేసరి వీర్' అనే హిందీ చిత్రంలో కూడా కీలక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా చేస్తూ ఆకాంక్ష శర్మ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. తాజా ఫొటో షూట్‌తో మరోసారి వార్తల్లో నిలిచిన ఆకాంక్ష శర్మ, గ్లామర్ బ్యూటీగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి



## 'బైకర్'పై ప్రభాస్ ప్రశంసలు

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్ హీరో శర్వానంద్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'బైకర్' సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొనగా, తాజాగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేసిన కామెంట్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ట్రైలర్‌ను చూసిన ప్రభాస్ తన సోషల్ మీడియాలో ప్రత్యేకంగా స్పందిస్తూ ట్రైలర్ వైబ్ చాలా బాగుందని, విజువల్స్ ఆసక్తికరంగా ఉన్నాయని అన్నారు. శర్వానంద్‌తో పాటు యూవీ క్రియేషన్స్, మొత్తం చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏప్రిల్ 3న సినిమా ఘన విజయం సాధించాలని కోరుకున్నారు. ప్రభాస్ నుంచి వచ్చిన ఈ ప్రశంసలతో 'బైకర్' ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. యాక్షన్ సన్నివేశాలు, రేసింగ్ ట్రాక్‌పై శర్వానంద్ చేసే స్టంట్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## పొలిటికల్ బ్యాక్ డ్రాప్ మూవీలో పవన్

దేవా కట్టాకు పవర్ స్టార్ గ్రీన్ సిగ్నల్?

ముద్ర, సినిమా డెస్క్ :

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినట్లు ఫిల్మ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'ప్రస్థానం' సినిమాతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దేవా కట్టా, తాజాగా పవన్ కళ్యాణ్‌కు ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ థ్రిల్లర్ కథను వినిపించారట. సమకాలీన రాజకీయాల నేపథ్యంతో రూపొందించిన ఈ కథ పవన్‌కు బాగా నచ్చడంతో వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే స్క్రిప్ట్‌ను పూర్తిగా సిద్ధం చేసిన దేవా కట్టా, ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ పాత్రను చాలా బలంగా డిజైన్ చేసినట్లు సమాచారం. ముఖ్యంగా పవన్ రాజకీయ భావజాలాన్ని ప్రతిబింబించేలా క్యారెక్టర్ ఉండబోతుందనే ప్రచారం జరుగుతోంది. గతంలో 'సత్యాగ్రహి' అనే పేరుతో రాజకీయ నేపథ్యంలో సినిమా చేయాలని పవన్ కళ్యాణ్ భావించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో, కానీ పూర్తిగా కొత్త కథతో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు బలమైన మెసేజ్ ఉండేలా ఈ పొలిటికల్ థ్రిల్లర్‌ను ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది



## రియల్ దురంధర్ బ్లాక్ టైగర్ రవీంద్ర కౌశిక్

ముద్ర, సినిమా డెస్క్:



సినిమాల్లో కనిపించే గూఢచారి కథలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. కానీ నిజ జీవితంలో అలాంటి సాహసం చేసి దేశం కోసం తన జీవితాన్ని అర్పించిన వ్యక్తి రవీంద్ర కౌశిక్. రాజస్థాన్‌కు చెందిన ఈ యువకుడు సాధారణ కుటుంబం నుంచి వచ్చి దేశ భద్రత కోసం అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించాడు. అందుకే ఆయనను నిజమైన దురంధర్‌గా గుర్తిస్తున్నారు. కేవలం 23 ఏళ్ల వయసులోనే రవీంద్ర కౌశిక్ రా ఏజెంట్‌గా ఎంపికయ్యాడు. దేశం కోసం తన అసలు వ్యక్తిత్వాన్ని పూర్తిగా మార్చుకుని 'నబీ అహ్మద్ షకీర్' అనే పేరుతో పాకిస్థాన్‌లోకి ప్రవేశించాడు. అక్కడ ఎలాంటి అనుమానం రాకుండా చదువు పూర్తి చేసి, పాకిస్థాన్ ఆర్మీలో ఉద్యోగం కూడా సంపాదించాడు. తన తెలివితేటలతో ఒక్కో మెట్టు ఎక్కుతూ చివరకు మేజర్ హోదాకు చేరుకున్నాడు. శత్రు దేశ సైన్యంలో ఉంటూనే భారత్‌కు అత్యంత కీలకమైన సమాచారాన్ని చేరవేసి దేశానికి గొప్ప సేవ చేశాడు. 1979 నుంచి 1983 వరకు ఆయన అందించిన సమాచారం భారత్‌కు చాలా ఉపయోగపడింది. పాకిస్థాన్ సైన్యానికి సంబంధించిన అనేక రహస్యాలు ముందుగానే తెలుసుకునేలా ఆయన చేసిన సేవలు దేశ భద్రతలో కీలక పాత్ర పోషించాయి. ఆయన ప్రతిభను గుర్తించిన అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, రవీంద్ర కౌశిక్‌కు 'బ్లాక్ టైగర్' అనే బిరుదును ఇచ్చారు. అయితే 1983లో ఒక చిన్న పొరపాటు కారణంగా ఆయన పాక్ అధికారులకు చిక్కిపోయాడు. తర్వాత దాదాపు 16 ఏళ్ల పాటు పాకిస్థాన్ జైళ్లలో కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. తీవ్రమైన అనారోగ్యంతో 2001లో జైలులోనే కన్ను మూశాడు.దేశం కోసం తన పేరు, కుటుంబం, జీవితాన్ని కూడా పణంగా పెట్టిన రవీంద్ర కౌశిక్ నిజమైన రియల్ హీరో. ఆయన త్యాగం ఎప్పటికీ భారత చరిత్రలో నిలిచిపోతుంది.

## మానస వారణాసికి కోలీవుడ్ నుంచి బంపర్ ఆఫర్

ముద్ర, సినిమా డెస్క్:



టాలీవుడ్‌లో గ్లామర్‌తో పాటు అభినయంతో ఆకట్టుకుంటున్న యంగ్ బ్యూటీ మానస వారణాసి ప్రస్తుతం సౌత్ ఇండియా ఫిల్మ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మిస్ యూనివర్స్ ఇండియా అయిన మానస, 'దేవకీ నందన వసుదేవ' సినిమాతో హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమై మంచి గుర్తింపు పొందింది. ఆ తర్వాత వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రం భారీ విజయాన్ని సాధించడంతో యూత్‌లో ఆమెకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో మానసకు పెరుగుతున్న ఫాలోయింగ్ చూస్తుంటే, ఈ బ్యూటీ త్వరలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న మానసకు ఇప్పుడు కోలీవుడ్ నుంచి కూడా ఆకర్షణీయమైన ఆఫర్ వచ్చినట్లు సమాచారం. తాజాగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో సక్సెస్ అందుకున్న నటుడు శశికుమార్ సరసన హీరోయిన్‌గా నటించే ఛాన్స్ ఆమెకు దక్కినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టును ప్రతిభావంతుడు దర్శకుడు మణికందన్ తెరకెక్కించబోతున్నారని సమాచారం.ఈ సినిమాలో శశికుమార్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. మాస్ యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఈ కథలో మానస పాత్ర కూడా చాలా ముఖ్యంగా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్‌లో ఇప్పటికే తన అందం, నటనతో గుర్తింపు తెచ్చుకున్న మానస, ఇప్పుడు తమిళ చిత్ర పరిశ్రమలోకి కూడా గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతోంది.ఇటీవల వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్న ఈ యంగ్ హీరోయిన్‌కు కోలీవుడ్‌లో స్టార్ హీరో, పేరున్న దర్శకుడితో సినిమా చేసే అవకాశం రావడం ఆమె కెరీర్‌కు పెద్ద మైలురాయిగా మారొచ్చని అభిమానులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, మానస అభిమానులు మాత్రం ఈ క్రేజీ ప్రాజెక్టుపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## మంచు ఫ్యామిలీలో విభేధాలు సమసిపోలేదా?

ముద్ర, సినిమా డెస్క్ :

మంచు మోహన్ బాబు కుటుంబంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న విభేదాలు తగ్గిపోయాయా అనే చర్చ మరోసారి మొదలైంది. ముఖ్యంగా అన్నదమ్ములు మంచు విష్ణు, మంచు మనోజ్ మధ్య జరిగిన గొడవలు అప్పట్లో పెద్దగా వార్తల్లో నిలిచాయి. ఆస్తి వివాదాల కారణంగా ఇద్దరూ దూరంగా ఉంటున్నారని కూడా ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా, తాజాగా మంచు లక్ష్మి తన కుమార్తె విద్యా నిర్వాణ ఓణీ వేడుకను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మోహన్ బాబుతో పాటు విష్ణు, మనోజ్ ఇద్దరూ తమ కుటుంబాలతో హాజరయ్యారు. వేడుకలో పాల్గొన్న ఫొటోలను మంచు లక్ష్మి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో, ఫ్యామిలీ గొడవలు సర్దుకున్నాయేమోనని చాలా మంది భావించారు. అయితే ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను గమనిస్తే కొన్ని ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. అందరూ కార్యక్రమానికి వచ్చినప్పటికీ, అందరూ కలిసి ఉన్న ఒక్క ఫొటో కూడా కనిపించలేదు. విద్యా నిర్వాణకు నలుగు పెట్టే సమయంలో తీసిన ఫొటోల్లో మంచు మనోజ్ కుటుంబం కనిపించకపోవడం, అలాగే కొన్ని ఇతర ఫొటోల్లో విష్ణు, మోహన్ బాబు కుటుంబాలు లేకపోవడం గమనార్హంగా మారింది. దీంతో అక్క కోసం ఒకే చోటుకు వచ్చినప్పటికీ అన్నదమ్ములు ఒకరినొకరు కలిసే పరిస్థితి లేకపోయిందా అనే సందేహాలు నెటిజన్లలో వ్యక్తమవుతున్నాయి. బయటకు చూస్తే విభేదాలు తగ్గినట్లే అనిపిస్తున్నా, మనసుల మధ్య దూరం మాత్రం ఇంకా అలాగే ఉందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.



## ఫొటో షూట్లతో హీట్ పెంచుతున్న అమైరా

ముద్ర, సినిమా డెస్క్ :

బాలీవుడ్ నటి అమైరా దస్తూర్ మరోసారి తన స్టైలిష్ ఫొటో షూట్లతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. తాజాగా విడుదలైన ఫొటో గ్యాలరీలో మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌తో పాటు క్లాసిక్ లుక్స్‌లో కూడా కనిపించి యూత్‌ను బాగా ఆకట్టుకుంది. ఒక్కో ఫొటోలో ఒక్కో స్టైల్‌తో మెరిసిన ఆమె అందం అభిమానులను ఫిదా చేస్తోంది. 'ఇస్సాక్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన అమైరా, తర్వాత జాకీ చాన్ సరసన 'కుంగ్ ఫూ యోగా'లో నటించి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల 'బఘీరా' సినిమాలో తన నటనతో మెప్పించిన ఆమె, 'బంబాయి మేరీ జాన్' వెబ్ సిరీస్‌తో కూడా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంది. తాజా ఫొటో షూట్లతో మళ్లీ వార్తల్లో నిలిచిన అమైరా దస్తూర్, స్టైల్ ఐకాన్‌గా కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు పెంచుకుంటోంది. అందం, గ్లామర్‌తో పాటు నటనతో కూడా ఆమె కెరీర్‌ను మరింత బలపరుచుకుంటోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com